
వాననీటి దెబ్బకు బెంగళూరు- హైదరాబాద్ హైవేపై కిక్కిరిసి పోయిన ట్రాఫిక్

ఐటీ.. వెతలపాలు

ఈనాడు, బెంగళూరు : బెంగళూరు ఔటర్ రింగ్ రోడ్డు ఐటీ కంపెనీల యాజమాన్యం రెండేళ్ల కిందట ప్రభుత్వానికి ఓ మనవిపత్రాన్ని అందించింది. 2023 నాటికి ఆ వలయ పరిధిలో రహదారులు, మెట్రో నిర్మాణాలను పూర్తి చేయాలని ఆ మనవిలో ప్రధానాంశం. నేటికీ హెబ్బాళ నుంచి టిన్ ఫ్యాక్టరీ వరకు, మైసూరు రోడ్డు నుంచి సర్జాపుర రోడ్డు, బెళ్లందూరు నుంచి సిల్క్‌బోర్డ్ వరకు దాదాపు 30 శాతం రహదారుల నిర్మాణం కొనసాగుతూనే ఉంది. ఈ కారణంగా మాన్యతా టెక్‌పార్క్, మొదలు, విప్రో వంటి ప్రముఖ కంపెనీల వద్ద రహదారి కూడళ్లు భారీ వాహనాలతో నిలిచి ఐటీ ఉద్యోగుల విధులపై ప్రభావాన్ని చూపుతున్నాయి. బెంగళూరు నగరంలో కనీసం 40 మి.మీ.వర్షపాతం నమోదైనా రహదారులన్నీ వరద నీటితో నిండే అవకాశం ఉందని.. రెండు వారాలుగా నగరంలో పలు చోట్ల 150 మి.మీ.లకు పైగా వర్షపాతం నమోదైంది. ఇలాంటి పరిస్థితుల్లో బెంగళూరు నగర మంత్రి డీకే శివకుమార్, హోంమంత్రి పరమేశ్వర్ చేసిన వ్యాఖ్యలతో నెటిజన్లు మండిపడుతున్నారు. ఎంతవర్షం వచ్చినా కేవలం అర్ధగంటలో నీటిని తోడేస్తాం. . వాన నీరు వస్తే నేల మీద పడక ఆకాశంలో పడుతుందా.. అంటూ వీరిద్దరూ చేసిన వ్యాఖ్యలు పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పట్టాయని ఆరోపిస్తున్నారు.

చినుకు రాలితే గూడు గుబులే

- మరో నాలుగురోజులూ ప్రమాదమే
- రాజధానివాసులకు తప్పని ఇక్కట్లు

ఈనాడు, బెంగళూరు : సరిగ్గా రెండేళ్ల కిందట.. బెంగళూరు నగరాన్ని ముంచెత్తిన వాన జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసింది. ఉద్యాన, ఐటీ నగరం బెంగళూరుకు పేరుకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాలు లేవన్న విమర్శ దశాబ్ద కాలంగా వినిపిస్తున్నదే. అంతర్జాతీయ స్థాయిలో పారిశ్రామిక, ఆర్థిక పర్యావరణ వ్యవస్థ అందిపుచ్చుకున్న సమయంలో అరకొర సదుపాయాలు మచ్చ తెచ్చేవే. రెండు వారాలుగా బెంగళూరును ముంచెత్తిన వానలు రెండేళ్ల కిందటి విపత్తును మరపిరాపోయేలా చేస్తున్నాయి. అప్పట్లో భాజపా ప్రభుత్వం ఉండగా.. నేడు కాంగ్రెస్ సర్కారు అధికారంలో కొనసాగుతోంది. అంతే తేడా. పరిస్థితులు మాత్రం యథాతథం. పైగా.. ఈసారి వర్షాలతో మరణాల సంఖ్య పెరగటం ఆందోళన కలిగించే అంశం.

నలుదిక్కులా ఇక్కట్లే

యలహంక, సర్జాపుర, సిల్క్‌బోర్డ్, కెంగేరి, కేఆర్ పురం.. ఇలా నగరానికి నలుదిక్కులా వానలు అవాంతరాలు సృష్టించాయి. మంగళవారం నగరంలో ఈ వానల ప్రభావం అని పలువురు మృత్యువాత పడ్డారు. కెంగేరి చెరువులో మునిగి మృత్యు ఒడిని చేరిన అన్నా, చెల్లి, కె.ఆర్.పురంలో నిర్మాణ దశలో ఉన్న ఓ కట్టడం కూలి ఒకరు మరణించగా.. ఈ సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉంది. యలహంకలో మురుగు కాల్వ దాటుతూ కాలి జారి పడిన ఓ వృద్ధురాలి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. భారీ వర్షాలతో వరద నీటితో మునిగిన రహదారులు రాకపోకలను స్తంభించేలా చేశాయి. నిర్మాణ దశలో ఉన్న కట్టడం కూలేందుకు ప్రమాణాలు లేకపోవడమే కారణమని ప్రాథమిక విచారణలో తేలిందంటే అందుకు బాధ్యత ఆ కట్టడానికి అనుమతిచ్చిన నగరాభివృద్ధి శాఖదే. ప్రస్తుతం బెంగళూరు నగరంలో దాదాపు 40వేలకు పైగా నివాసితులు వరద నీటిలో చిక్కుకున్నట్లు బీబీఎంపీ పాలనాధికారి వెల్లడించారు. ఒక్క యలహంక కేంద్రీయ విహార్ బహుళ సముదాయ భవనంలోనే దాదాపు మూడు వేల మంది వరద నీటిలో చిక్కుకున్నారు. ఆ బాధితుల్లో కొందరు చేస్తున్న ఆరోపణ వింటే పాలనా వ్యవస్థ నిర్లక్ష్యం ఏ పాటిదో తెలుస్తోంది. ఇంతటి వరద నీరు మా భవనం మట్టూ చేరగానే ఎన్‌డీఆర్ఎఫ్ బృందం వచ్చి మమ్మల్ని సురక్షిత ప్రాంతానికి చేరుస్తుంది. ఇంతటితో సమస్య తీరిందనుకుంటే పొరపాటే.. ప్రతి సారీ ఇదే పరిస్థితి తలెత్తితే ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలి కదా? అంటూ అక్కడివారు ప్రశ్నించారు. ఈ ప్రశ్నలో వాస్తవం లేకపోలేదు. ప్రతి ఏటా ఇలాంటి భవన సముదాయాలు యలహంక పరిసరాల్లో ముంపునకు గురైతే ఆదే ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు వచ్చి సాయం చేస్తుంటాయి. ఎన్‌డీఆర్ఎఫ్ సాయం చేస్తుంటే స్థానిక ప్రభుత్వ సాయం ఏదన్న ప్రశ్న సామాజిక మాధ్యమాల నుంచి వ్యక్తం అవుతోంది.

వారు.. వీరు వేస్తారు

ప్రస్తుతం బెంగళూరు నగరంలో మురుగునీటి కాల్వలకు, బెస్కాం, ప్రజా పనుల శాఖ తవ్వకాలకు మధ్య తేడా తెలియని పరిస్థితి. ప్రస్తుతం నగరంలోని దాదాపు 2,500 కిలోమీటర్ల పొడవునా బెస్కాం సంస్థ భూగర్భ విద్యుత్తు వ్యవస్థలను ఏర్పాటు చేస్తోంది. టెలికి బీఎస్ఎన్ఎల్, ప్రజా పనుల తవ్వకాలు అదనం. బెస్కాం సిబ్బంది వేసిన విద్యుత్తు తీగలను బీఎస్ఎన్ఎల్ సిబ్బంది తొలగిస్తే వాటిని ప్రజా పనుల సిబ్బంది పూడ్చుతుంటుంది. ఇలాంటి పనులు వర్షాల సమయంలో వరదనీటితో నిండి పాదచారుల ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తున్నాయని బెంగళూరు ప్రయాణికుల వేదిక సమన్వయకర్త రమేశ్ ఆనంద్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిసారీ ఈ శాఖల మధ్య సమన్వయం ఉండాలని మేము మనవి పత్రాలను ఇస్తున్నా వాటిని బీబీఎంపీ, నగరాభివృద్ధి శాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆరోపిస్తున్నారు. రహదారులకు ఇరువైపులా ఈ తవ్వకాలు వర్షాకాలంలో వాహనదారులు, పాదచారుల ప్రాణాలకు కంటకంగా మారుతున్నాయన్నది ఈ సంఘం ఆరోపణ.


విమానాశ్రయ మార్గంలోని కోగిలు కూడలి నిండా మునిగి విలవిల..


యలహంక చెరువు నీటి తాకిడితో..
ఓ వీధిలోకి దూసుకొచ్చిన సహాయక పడవ

అన్నా, చెల్లి చెరువుపాలు


శ్రీనివాస్, మహాలక్ష్మి

యశ్వంతపుర, కెంగేరి : నీరు తెచ్చేందుకు కెంగేరి చెరువులో దిగిన చెల్లెలు మహాలక్ష్మి(11) మునిగిపోతోందని గుర్తించిన సోదరుడు శ్రీనివాస్ అలియాస్ జాన్సీ(13) నీటిలోదిగి ఇక్కట్లలో చిక్కారు. ఆ ఇద్దరూ చెరువులో మునిగి మృతి చెందిన సంఘటన కెంగేరి పోలీసుఠాణా పరిధిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. మృతుల్లో ఒక్కరైన శ్రీనివాస్ మృత దేహాన్ని మంగళవారం ఉదయం అగ్నిమాపక సిబ్బంది వెలికితీశారు. మహాలక్ష్మి మృతదేహం కోసం గాలిస్తున్నారు. నీటిలో కనిపించే కెమెరాల సాయంతో మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వీరిద్దరూ పారిశుద్ధ్య కార్మికురాలు జయమ్మ కుటుంబీకులుగా గుర్తించారు. విషయం తెలిసిన వెంటనే సోమవారం సాయంత్రం ఆరుగంటల నుంచి అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. వర్షం కురుస్తుండటం, చీకటిపడటంతో గాలింపు చర్యలు నిలిపి ఉదయం నుంచి కొనసాగిస్తున్నారు.

భవంతి చుట్టూ బిక్కుబిక్కు

బెంగళూరు (శివాజీనగర) : బాబూసాపాళ్యలో నిర్మాణంలో ఉన్న ఆరంతస్తుల భవంతి మంగళవారం సాయంత్రం కుప్పకూలాక.. ఆ చుట్టుపక్కల విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రమాద సమయంలో 20 మందికి పైగా కార్మికులు అందులో ఉండగా.. ఇప్పటి వరకు 14 మంది కార్మికులను పోలీసులు, స్థానికులు, విపత్తు నిర్వహణ దళం సిబ్బంది రక్షించగా.. ఒకరు మరణించారని అధికారులు ప్రకటించారు. వారి బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనలో బాధితులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. లోపల చిక్కుకున్న ఇతర కార్మికులను రక్షించేందుకు హెణ్ణూరు ఠాణా పోలీసులు, అగ్నిమాపకదళ సిబ్బంది ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. భవంతి శిథిలాలు భారీ పరిమాణంలో ఉండటంతో వేగంగా పనులు కొనసాగించలేని పరిస్థితి నెలకొంది.


వరుస వర్షాలకు బెంగళూరు బాబూసాపాళ్యలో కుప్ప కూలిన నిర్మాణంలోని బహుళ అంతస్తుల భవంతి

ఆగమేఘాలపై సహాయక చర్యలు


కేంద్రీయ విహార్‌లో చిక్కుకుపోయిన వృద్ధులను బోటులోకి ఎక్కించేందుకు తీసుకు వస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపకదళ సిబ్బంది

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : జలవిపత్తుతో సమస్యలు తలెత్తిన ప్రాంతాల్లో బృహత్ బెంగళూరు మహానగర పాలికె అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు పర్యటించి సమస్యలను పరిష్కరించే పనిలో నిమగ్నమయ్యారు. ఇలా.. కష్టకాలంలో కాలనీల్లోకి అడుగుపెడుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలను స్థానికులు తూర్పారబట్టారు. భారీవర్షాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలోని విద్యాసంస్థలకు జిల్లా పాలనా యంత్రాంగం బుధవారం సెలవు ప్రకటించింది. బెంగళూరులో నిర్మాణంలో ఉన్న ఆరంతస్తుల భవంతి, పక్కనే నిర్మాణంలో ఉన్న భవంతి కుప్పకూలింది. మైసూరులో మల్లిగె ఇడ్లీ భవంతి ఇలానే కూలిపోయింది. వస్తు ప్రదర్శన కోసం వేసిన షెడ్లు కూలిపోయాయి. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. చిక్కబళ్లాపురలో భారీ వర్షానికి జనజీవనం అస్తవ్యస్తమైంది. నంది క్రాస్, చింతామణి చుట్టుపక్కల ప్రాంతాల్లో బిలమార్గాల్లో నీరు నిలిచింది. జక్కలమడుగు, గుడిబండె, శ్రీనివాససాగర, కేతనహళ్లి జలాశయాలు ఉప్పొంగుతున్నాయి. పినాకిని నదిలో ప్రవాహం పెరిగింది. తీర ప్రాంత జిల్లాల్లో బుధవారం రెడ్ అలర్ట్ ఉంటుందని భారతీయ వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. బెంగళూరులో వర్తుల రహదారి, మహదేవపుర, ఇబ్లూరు, మారతహళ్లి తదితర ప్రాంతాల్లోనూ సర్వీసు రోడ్లలో బైకులపై ప్రయాణించవద్దని నగర ట్రాఫిక్ పోలీసులు కోరారు. ఇంటి నుంచి పని చేసేందుకు అవకాశం ఉన్న వారికి ఆ సదుపాయాన్ని వినియోగించుకోవాలని పలు సంస్థలు తమ ఉద్యోగులను కోరాయి. బిలమార్గాల్లో నిలిచిన నీటిని తొలగించేందుకు పాలికె, బెస్కాం, అగ్నిమాపక దళ సిబ్బంది, విపత్తు నిర్వహణ దళం ప్రతినిధులు ప్రయత్నాలు ప్రారంభించారు. వర్షంతో పలు చోట్ల భారీ వృక్షాలు కూలిపోయాయి. ఆ మార్గాల్లో వాహన రద్దీ సమస్య ఎదురైంది. వర్షం కురుస్తున్న సమయంలో హఠాత్తుగా సర్వీసు రోడ్లపైకి వరద నీరు చేరుతోంది. అక్టోబరు 1 నుంచి 22 వరకు నగరంలో 241 మి.మీ. వర్షపాతం కురిసింది. గత 124 ఏళ్లలో ఇదే నాలుగో అత్యధిక వర్షమని అధికారులు తెలిపారు. గతంలో 1943, 1970, 2005 అనంతరం ఇప్పుడే అధిక వర్షం కురిసిందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.


కారు వద్దు..
సొంత బోటు ఎంతో ముద్దు

రాచనగరికి ప్రియాంక

నేడు వయనాడ్‌కు పయనం

ఈనాడు, బెంగళూరు : కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గానికి నామినేషన్ వేయనున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక వాద్రే మంగళవారం సాయంత్రం మైసూరుకు చేరుకున్నారు. ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీతో కలిసి ఆమె మైసూరు విమానాశ్రయానికి చేరుకోగానే కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, పార్టీ నేతలతో కలిసి ఆహ్వానించారు. మంగళవారం రాత్రి మైసూరులోనే బస చేసిన వీరిద్దరూ బుధవారం ఉదయం నేరుగా వయనాడ్‌కు బయలుదేరుతారు. భారీ వర్షాల నేపథ్యంలో విమాన ప్రయాణాన్ని రద్దు చేసుకుని రోడ్డు మార్గంలో వీరు వయనాడ్‌కు చేరుకుంటారని పార్టీ వర్గాల సమాచారం. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిల్లీ నుంచి నేరుగా వయనాడ్‌కు చేరుకుంటారు. బుధవారం ఉదయం 11 గంటలకు వయనాడ్‌కు చేరుకునే ప్రియాంక వాద్రే అక్కడి కల్పెట్టా బస్‌స్టాండ్ నుంచి వయనాడ్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రోడ్ షో నిర్వహిస్తారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సుర్జేవాలాతో పాటు పలువురు నేతలు హాజరవుతారు.


మైసూరు విమానాశ్రయంలో సోనియాగాంధీ, ప్రియాంకలను ఆహ్వానిస్తున్న సిద్ధరామయ్య, డీకే శివకుమార్

ప్రజల అండే శ్రీరామరక్ష

మైసూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రజల అండ ఉన్నంత వరకు తాను భాజపా, దళ్ కుట్రలకు భయపడనని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. వారి అసత్య ఆరోపణలతో సామాజిక న్యాయం చేయకుండా వెనక్కు తగ్గనని స్పష్టం చేశారు. వరుణ నియోజకవర్గంలో రూ. 501.81 కోట్ల ఖర్చుతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు మంత్రులతో కలిసి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయా పథకాల లబ్ధిదారులకు వ్యవసాయ యంత్ర పరికరాలు, వాహనాలను పంపిణీ చేశారు. స్థానికుల నుంచి ఆయన సత్కారాన్ని అందుకుని మాట్లాడారు. వరుణ ఓటర్ల ఆశీస్సులతో రెండుసార్లు ముఖ్యమంత్రిని అయ్యానని చెప్పారు. ఈ నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోటని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా తాను ఆయా పథకాలను చేపట్టేందుకు నిధులు కేటాయించి, పనులకు శంకుస్థాపన చేశానని చెప్పారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పేదలకు ఆర్థికశక్తిని అందించేందుకు గ్యారంటీలను అమలు చేస్తున్నానని తెలిపారు. గ్యారంటీ పథకాల జారీకి బడ్జెట్‌లో రూ.56 వేల కోట్లను కేటాయించానని తెలిపారు.

పేదలంటే వారికి మంట

కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి, కర్ణాటకలో మాజీ ముఖ్యమంత్రులు యడియూరప్ప, బొమ్మై, కుమారస్వామికి పేదలంటే కంటగింపని సిద్ధరామయ్య దుయ్యబట్టారు. మూడుసార్లు ప్రధాని అయిన నరేంద్రమోదీ, తాను ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రతిసారీ విఫలమవుతున్నారని తప్పుబట్టారు. శ్రీమంతులు, వ్యాపారులకు, ఉత్తరాది వారికి మాత్రమే ప్రధాని అన్నట్లు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. కర్ణాటక ఎక్కువ మొత్తంలో పన్ను చెల్లిస్తున్నా వాటా మాత్రం నామమాత్రంగా ఉందన్నారు. జిల్లా వ్యవహారాల మంత్రి మహదేవప్ప, మంత్రులు వెంకటేశ్, రహీం ఖాన్, బోసురాజు, కెమ్మెల్సీ యతీంద్ర, ఎమ్మెల్యేలు రవిశంకర్, దర్శన్ ధ్రువనారాయణ, తిమ్మయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల వేదికపై మంత్రులు, ప్రముఖులతో సిద్ధరామయ్య

రాజధానికి నిద్ర కరవు


బెంగళూరు ఉత్తర విభాగంలోని ఒక అపార్ట్‌మెంట్ నుంచి నివాసులను ఎక్కించుకునేందుకు వచ్చిన బోటు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : ఎప్పుడు.. ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని రాజధాని బెంగళూరుకు సోమవారం రాత్రంతా నిద్ర కరవైంది. సోమవారం అర్ధరాత్రి నుంచి మొదలైన వాన.. వాగులు, వంకలను ఉప్పొంగేలా చేసింది. యలహంక కేంద్రీయ విహార్‌లో రాత్రికిరాత్రే నడుము లోతుకు నీళ్లు వచ్చేశాయి. చెక్క మంచాలు, కుర్చీలు నీళ్లపై తేలాయి. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కావడంతో ఆ వ్యవస్థ దెబ్బతిని ఇళ్లలో చీకట్లు కమ్ముకున్నాయి. బల్లలు, కుర్చీలు, టీపాయిలపై పెట్టిన ల్యాప్‌టాప్, సెల్ ఫోన్లు నీటిపాలై అనేకం పాడయిపోయాయి. బీరువాల్లోకి నీరు చేరింది. దుస్తులు తడచిపోయాయి. నిత్యావసరాలన్నీ నీట మునిగాయి. ఇంట్లో ఉన్న నగదు, ఆభరణాలను హడావిడిగా సంచుల్లో సర్దుకున్నారు. బీరువాల్లో తడవకుండా ఉన్న దుస్తులను మూట గట్టి కాపాడుకునే ప్రయత్నం చేశారు. పిల్లల్ని ఎత్తుకుని నడుము లోతు నీటిలో నడుచుకుంటూ, మొదటి అంతస్తులోకి వచ్చి జాగారం చేశారు. కేంద్రీయ విహార్ ఆవరణలోకి ఇలా నీరు రావడం గత రెండు నెలల్లో ఇది నాలుగో సారి. ఈసారి వెనుక గోడ కూలిపోవడంతో ఎక్కువ నీరు చేరింది. ఇక్కడ 600కు పైగా ఫ్లాట్లలో 2500 మంది ఉంటున్నారు. వారిలో వృద్ధులు, బాలలు ఎక్కువ. నిద్రకు కరవై-బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్న వారందరినీ మంగళవారం ఉదయం నుంచి యుద్ధ ప్రాతిపదికన బయటకు తీసుకువచ్చారు. ఒక వారం పాటు అపార్ట్‌మెంట్ ఆవరణకు రావద్దని అధికారులు సూచించారు. వారందరికీ ప్రభుత్వమే మంగళవారం మధ్యాహ్నం భోజన వ్యవస్థను కల్పించింది. కొందరు హోటళ్లకు, మరికొందరు తమ బంధువుల ఇళ్లకు, మిగిలిన వారు తమ సొంత ఊళ్లకు బయలుదేరి వెళ్లారు. ఇది ఒక్క కేంద్రీయ విహార్ అనుభవమే కాదు.. ఉత్తర బెంగళూరులోని అనేక కాలనీలు ఇక్కట్లలో మునిగి తేలాయి. పలు కాలనీల్లో చిక్కుకున్న వారిని బోట్ల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వర్షంతో ఊళ్లకు వెళ్లేవారు తమ బస్సులు, రైళ్లు, విమానాలను సకాలంలో అందుకోలేకపోయారు. కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వెళ్లవలసిన 20కు పైగా విమానాలు ఆలస్యంగా బయలుదేరి వెళ్లాయి. దిల్లీ, హైదరాబాద్, చండీగఢ్, బ్యాంకాక్ నుంచి బెంగళూరుకు రావలసిన విమానాలను చెన్నైకు మళ్లించారు. మల్లేశ్వరంలో భారీ వృక్షం ఒకటి వాహనాలపై పడింది. ఆ సమయంలో ఎవరూ గాయపడలేదు.


ఉత్తర బెంగళూరులో నీటిపాలైన ఓ అపార్ట్‌మెంట్ ప్రాంగణం


కేంద్రీయ విహార్‌లో నీటిలో మునిగిన కార్లు


చేయి విరిగి, ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఓ బాలుడిని రక్షించి తీసుకొస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది


బెంగళూరు కేంద్రీయ విహార్ వాసులను పడవల్లో తరలిస్తున్న సహాయకులు


జలాశయం 23 గేట్లగుండా నదివైపు వెళ్తున్న తుంగభద్ర జలాలు

తుంగభద్ర ఉగ్రరూపం

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్రమ్మ ఉగ్రరూపం దాల్చింది. ఎగువ ప్రాంతాల నుంచి లక్షక్యూసెక్కుల దాకా వరద వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో జలాశయంలోని 23 గేట్లను పైకెత్తి లక్ష క్యూసెక్కులను నదికి విడుదల చేస్తున్నారు. జలాశయం ఎగువ ప్రాంతాలైన శివమొగ్గ, ఆగుంబె, తీర్థహళ్లి, కడూరు, సాగర, హొసనగర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో జలాయానికి వస్తున్న వరద ప్రమాణంలో మంగళవారం పెరుగుదల కనిపిస్తోంది. జలాశయం పూర్తినీటిమట్టం 1633 అడుగులుండగా, 1631.92 అడుగుల దాకా నీటిని నిల్వ చేసుకుని మిగిలిన వరదను బయటకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర నదికి పెద్దఎత్తున నీటిని విడుదల చేయడంతో హంపీలో తుంగభద్ర నది ఉద్ధృతంగా పారుతోంది. నదివైపు సందర్శకులు, భక్తుల రాకపోకలపై నిషేధాన్ని విధించారు.

అప్పు చెల్లించలేదని హత్య

ఉడుపి, న్యూస్‌టుడే : తన వద్ద తీసుకున్న నగదును తిరిగి ఇవ్వలేదని ప్రశాంత్ శెట్టి (32) అనే వ్యక్తిని స్నేహితుడు ఈరణ్ణ (30) కత్తితో గొంతుకోసి మంగళవారం ఉదయం హత్య చేశాడు. హంతకుడు విజయనగర జిల్లా హూవినహడగలి నివాసి. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఒక భవంతి దిగువ అంతస్తులో కత్తితో దాడి చేసి హత్య చేశాడు. నిందితుడ్ని అరెస్టు చేసి, విచారణ చేస్తున్నామని ఎస్పీ కె.అరుణ్ తెలిపారు.

హిందీకి వ్యతిరేకంగా నిరసనగళం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కన్నడ భాషాభివృద్ధికి ఏలికలు శ్రమించాలని, హిందీకి అవకాశమే ఇవ్వరాదంటూ బెంగళూరు స్వాతంత్ర్య ఉద్యానవనంలో వివిధ కన్నడ సంఘాల కార్యకర్తలు మంగళవారం ఆందోళనకు దిగారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా కన్నడ సాహితీవేత్త జాణగెరె వెంకటరామయ్య మాట్లాడుతూ బలవంతంగా హిందీని రుద్దేందుకు ప్రయత్నించడం సరికాదని అభ్యంతరం తెలిపారు. పరాయి భాషకన్నా కన్నడకే ఎక్కువ ప్రాధాన్యమివ్వాలనే డిమాండు చేశారు. వివిధ కార్యాలయాల్లో హిందీ భాషను బలవంతంగా అమలు చేయడం తగదన్నారు. నవంబరు ఒకటిన కన్నడ భాషోన్నతి కోసం ప్రత్యేక ఆందోళన నిర్వహిస్తామని ప్రకటించారు.

వైద్యం బాధ్యతాయుత వృత్తి



హొసపేటె: పట్టణంలో నిర్మాణ దశలో ఉన్న 300 పడకల ఆసుపత్రి బ్లూప్రింట్‌ను పరిశీలిస్తున్న మంత్రి దినేశ్ గుండూరావు

హొసపేటె, న్యూస్‌టుడే: వైద్యులు, ఉపాధ్యాయులు తమ బాధ్యతను విస్మరిస్తే, సమాజంపై తీవ్ర చెడు ప్రభావం పడుతుందని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దినేశ్ గుండూరావు పేర్కొన్నారు. మంగళవారం హొసపేటెలో ఏర్పాటు చేసిన విజయనగర, కొప్పళ జిల్లాల ప్రగతి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులు మినహాయించి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఉన్నది వైద్యశాఖలోనే. సుమారు 70వేల మంది సేవలందిస్తున్నారు. ప్రజలతో మమేకమై పనిచేసే అవకాశం వైద్యశాఖ సిబ్బందికి మాత్రమే దక్కుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సేవలందించాలని ఆయన పిలుపునిచ్చారు. మీరు నెలరోజులు కష్టపడిన ఫలితానికి ప్రభుత్వం జీతాలు ఇస్తుంది, జీతాలకోసమే కర్తవ్యం చేయడం సబబు కాదని తేల్చిచెప్పారు. ఆరోగ్య శాఖలో నిధుల కొరత లేదు. పంచాయతీకో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించాం. కొన్నింటికి సముదాయ ఆరోగ్య కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేశామని తెలిపారు. గ్రామీణులకు మెరుగైన వైద్యం అందివ్వటానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యేలు గవియప్ప, డాక్టర్ శ్రీనివాస్, వైద్యశాఖ కార్యదర్శి హర్షగుప్త, విజయనగర డీసీ దివాకర్ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఆయన కూడ్లిగిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం హొసపేటెలో నిర్మాణ దశలో ఉన్న 300 పడకల ఆసుపత్రిని పరిశీలించారు.



కూడ్లిగిలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి దినేశ్ గుండూరావు, ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాస్

హంపీ వర్సిటీ వీసీకి సోదె సదాశివరామ పురస్కారం



సోదె సదాశివరామ పురస్కారం అందుకుంటున్న హంపీ కన్నడ వర్సిటీ ఉపకులపతి డాక్టర్ డి.వి.పరమశివమూర్తి

హొసపేటె, న్యూస్‌టుడే: చరిత్ర విభాగంలో చేసిన పరిశోధనలు, సాధనలకుగాను ఉత్తర కన్నడ జిల్లా సోదె రాజ వంశీకులు రాజుపేరుపైన ఏటా ప్రదానం చేసే ప్రతిష్ఠాత్మక సోదె సదాశివ రాయ పురస్కారాన్ని హంపీ వర్సిటీ ఉపకులపతి డాక్టర్ డి.వి.పరమశివమూర్తి అందుకున్నారు. ఉత్తర కన్నడ జిల్లా శిర్సీలో ఏర్పాటు చేసిన చరిత్ర సమ్మేళనంలో గంగాధరేశ్వర స్వామీజీ పాల్గొని ఉపకులపతికి పురస్కార ప్రదానం చేశారు. సోందే రాజవంశీకుల చరిత్రపై వీసీ మంచి పుస్తకాన్ని రాశారని స్వామీజీ కొనియాడారు.

పోటీకి భరత్ అర్హుడే

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : శిగ్గావ్ ఉప ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై కుమారుడు భరత్‌కు భాజపా టికెట్ ఇవ్వడం సబబేనని విధానసభలో ఉప విపక్ష నాయకుడు అరవింద్ బెల్లద్ వ్యాఖ్యానించారు. ఈ అంశాన్ని కుటుంబ, వారసత్వ రాజకీయాలుగా పరిగణించరాదని వివిధ పార్టీల నాయకులకు హితవు పలికారు. రాష్ట్ర, జాతీయ నాయకులు అన్ని అంశాలూ పరిగణనలోకి తీసుకుని, సుదీర్ఘంగా చర్చించిన అనంతరమే భరత్‌కు అవకాశమిచ్చారని చెప్పారు. ఉప ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా భాజపా నాయకులందరూ పని చేస్తున్నామని తెలిపారు.

నకిలీ వైద్యుడి ఆటకట్టు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగరంలో నకిలీ వైద్యుడు నిర్వహిస్తున్న క్లినిక్‌పై జిల్లా పాలనాధికారి ఆదేశాలతో జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖాధికారులు దాడులు చేశారు. నకిలీ వైద్యుడిపై కేసు నమోదు చేసి వాటిని జప్తు చేశారు. పెళ్లై అయిన తర్వాత సంతానం కాకపోతే..సంతానం అయ్యేలా చికిత్స అందించి డబ్బులు ఖర్చు చేయిస్తున్న విషయం తెలుసుకున్న జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖాధికారి డా. రమేష్‌బాబు జిల్లా ఆదేశాలతో వైద్య అధికారి డా. అబ్దుల్లా, డా. సురేష్‌కుమార్, తదితర అధికారులు, సిబ్బంది స్థానిక గ్రహం రహదారిలోని పింజార్ వీధికి చేరుకున్నారు. ఎలాంటి వైద్య వృత్తి కోర్సు పదవీ లేకున్నా సంతానం లేని వారికి చికిత్స అందజేస్తున్న సి.శ్రీధర్ (శ్రీధర హలహరవి) క్లినిక్‌పై దాడి చేశారు. కె.పి.ఎం.ఇ.అనుమతి లేకుండా క్లినిక్‌లను నిర్వహిస్తున్నట్లు గుర్తించినట్లు డీహెచ్‌వో తెలిపారు. శ్రీధర్ ఎలాంటి బోర్డు లేకుండా ఓ ఇంట్లో క్లినిక్‌ను నిర్వహిస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. క్లినిక్‌లో ఎలాంటి రసీదు లేకుండా 20 నుంచి 30 మంది మహిళలతో డబ్బులు తీసుకుంటున్నారు. ఆలోపతిక్ ఔషధాలు, హార్మోన్ ఇంజక్షన్లు ఇస్తున్నట్లు గుర్తించారు. మహిళలు సంతానం కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న వైద్య నిపుణులతో చికిత్స చేయించుకోవాలి. ఇలాంటి నకిలీ వైద్యులతో చికిత్స చేయించుకోకూడదని డీహెచ్‌వో తెలిపారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



క్లినిక్‌కు వచ్చిన మహిళలతో మాట్లాడుతున్న నకిలీ వైద్యుడు శ్రీధర్



నకిలీ వైద్యుడు శ్రీధర్‌తో వైద్య అధికారులు, సిబ్బంది

రహదారి ఆధునికీకరణలో అలసత్వంపై కన్నెర్ర

న్యాయవాదుల రాస్తారోకో

సిరుగుప్ప, న్యూస్‌టుడే: అధికార, ప్రతిపక్ష శాసనసభ్యులు రహదారి అభివృద్ధి పోరాటానికి కలిసిరావాలని న్యాయవాదుల సంఘం పిలుపునిచ్చింది. పట్టణంలోని న్యాయాలయం ఎదురుగా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సిరుగుప్ప బళ్లారి-ప్రధాన రహదారి-150ఏ పై ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఉప్పార వెంకోబ, సీనియర్ న్యాయవాదులు జి.బి.గుండళ్లి, శివరుద్రగౌడ, విరేశ్ గౌడ, మునిస్వామి మాట్లాడుతూ సరిహద్దున దడేసూగురు నుంచి తెక్కెలకోట వరకు జాతీయ రహదారి 150ఏ ఆధునికీకరణకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. మూడేళ్లు గడిచినా పనులు పూర్తి చేయలేదు. ఈ రహదారి అంతా గుంతలమయమై, ఎండ కాస్తే దుమ్ము, దూళి, వానొస్తే నీరు చేరి ప్రమాదాలకు కేంద్రంగా మారిందని ఆరోపించారు. ఇప్పటికే 16 కిలోమీటర్ల రహదారిలో 23 మంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని, 49 ప్రమాదాలు జరిగాయన్నారు. సంబంధిత రహదారి ప్రాధికార అధికారులపై బాధితులు, పోలీసుస్టేషన్‌లో 30కి పైగా కేసులు నమోదు చేశారన్నారు. న్యాయాలయంలోనూ కేసులు నమోదైనా అధికారులు, ఇంజినీర్లు, ప్రభుత్వంలో ఎలాంటి స్పందన లేదని మండిపడ్డారు. ప్రయాణికులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా తామే ఉద్యమిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం స్పందించకుంటే ప్రజా పోరాట సంఘాలు, ప్రజలు, విద్యార్థులు, యువతతో కలిసి త్వరలోనే తీవ్ర పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. గ్రేడ్-2 తహసీల్దార్ సత్యమ్మ, జాతీయ ప్రాధికార సహాయక ఇంజినీర్ ప్రదీప్‌నాయక్‌కు వినతిపత్రాలు అందించారు. న్యాయవాదుల సంఘం కార్యదర్శి శివకుమారస్వామి, న్యాయవాదులు మంజునాథ గౌడ, వినయ్, దొడ్డనగౌడ, అబ్దుల్‌నబి ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు. డీఎస్పీ వెంకటేశ్, సీఐ హనుమంతప్ప, ఎస్ఐ.పరుశురామ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



అధికారులు సత్యమ్మ, ప్రదీప్‌నాయక్‌లకు వినతిపత్రం అందిస్తున్న న్యాయవాదులు



న్యాయవాదుల రహదారి ఆధునికీకరించాలని చేపట్టిన ధర్నాలో మాట్లాడుతున్న అధ్యక్షుడు యు.వెంకోబ

కలుషిత నీరు తాగి ఇద్దరి మృతి

15మంది ఆసుపత్రిపాలు



ఆందోళనలో టి.తుంబిగెరె గ్రామస్థులు



భోవి మహంతేష్

హొసపేటె, న్యూస్‌టుడే: కుళాయిల ద్వారా గ్రామ పంచాయతీ వారు విడుదల చేస్తున్న నీరు తాగి ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన ఘటన హరపనహళ్లి తాలూకా టి.తుంబిగెరెలో ఆలస్యంగా వెలుగు చూసింది. శనివారం భోవి సురేశ్ మృతిచెందగా, సోమవారం రాత్రి భోవి మహంతేశ్ మృతి చెందాడని గ్రామస్థులు తెలిపారు. మరో 15 మంది దావణగెరె, హరపనహళ్లి ఆసుపత్రుల్లో చికిత్స అందుకుంటున్నారు. కొళాయిల్లో విడుదల చేస్తున్న నీరు కలుషితం కావడంతో ఇద్దరు మృతి చెందినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మంగళవారం రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దినేశ్‌గుండూరావు జిల్లా పర్యటన చేస్తున్నారని తెలిసి, గ్రామస్థులు ఆందోళన చేపట్టడంతో విషయం వెలుగు చూసింది. జిల్లా వైద్యశాఖ అధికారులు హుటాహుటిన గ్రామాన్ని సందర్శించి కుళాయి నీటి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపారు. ఇద్దరు మృతి చెందేవరకు అధికారులు స్పందించలేదని గ్రామస్థులు ధ్వజమెత్తారు. ఇటీవల కురిసిన వర్షాలతో మురుగునీరు కుళాయిలో చేరి నీరు కలుషితమై ఉండవచ్చని వైద్యులు సంశయం వ్యక్తం చేస్తున్నారు. కుళాయి నీటిని వెంటనే నిలిపివేసి, గ్రామానికి ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు.

నగరం.. వాననీటి సాగరం



విలాసవంతమైన ఓ వాడను నిలువునా ముంచిన వాననీరు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఎడతెరిపిలేని వర్షానికి సగం బెంగళూరు ముంపులో కొట్టుమిట్టాడుతోంది. రహదారులు వాగులను తలపించాయి. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అపార్ట్‌మెంట్లలోకి నీరు ప్రవహించడంతో పార్కింగ్ చేసిన వాహనాలు నీటిలో తేలాయి. కొన్ని కొట్టుకుపోయి.. దూరంగా ఆగాయి. విద్యుత్తు సరఫరా నిలిచి పోవడంతో ప్రజల కష్టాలు వర్ణనాతీతం. నీటిలో చిక్కిన ప్రజలను ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పడవల సహాయంతో బయటకు తరలించారు. ఉత్తర బెంగళూరు పరిధిలోని యలహంక, టాటానగర, భద్రప్పలేఅవుట్, ఆట్టూరు, కువెంపునగర, దాసరహళ్లి, సర్జాపుర, రెయిన్‌బో డ్రైవ్ లేఔట్ మరోసారి ముంపు ముప్పుపాలయ్యాయి. విల్లాల్లోకి నీరు ప్రవహించడంతో ప్రజలు భయాందోళనలకు లోనయ్యారు. మంగళవారం ఉదయం కొన్ని విల్లాలను ఖాళీ చేసి ప్రజలు సమీపంలో ఉన్న హోటళ్లకు వెళ్లి తలదాచుకున్నారు. టాటానగర పూర్తిగా నీటిమయం కావడంతో ప్రజలకు పాలికె సిబ్బంది తాగునీటి సీసాలు, భోజనం పొట్లాలను సమకూర్చింది. వరద పీడిత ప్రాంతాన్ని రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణబైరేగౌడ పరిశీలించారు. నీరు ఎక్కువగా ఉండటంతో పాలికె చీఫ్ కమిషనర్ తుషార్‌గిరినాథ్ ట్రాక్టర్ ఎక్కి ముంపు ప్రాంతాల్లో పరిస్థితి తెలుసుకున్నారు. విద్యారణ్యపుర, కువెంపునగరలో రహదారులు కాలువలుగా మారిపోయాయి. సర్జాపుర రహదారి దుస్థితి వర్ణనాతీతం. నగరవ్యాప్తంగా సంచార రద్దీ ఏర్పడింది. లోతట్టు ప్రదేశం భద్రప్ప లేఔట్ ఇళ్లు పడవల్లా కనిపించాయి. హెబ్బాళ్ రింగ్‌రోడ్డు కూడలిలో రాజకాలువలు పొంగి ప్రవహించాయి.

- మంగళవారం ఒక్కరోజే నాలుగువేల ఇళ్లలోకి నీరు చేరినట్లు పాలికె చీఫ్ కమిషనర్ తుషార్‌గిరినాథ్ తెలిపారు. పది లేఅవుట్లలో ఈ ప్రభావం ఎక్కువగా ఉందని, నిలబడిన నీటిని యంత్రాల సహాయంతో బయటకు పంపిస్తున్నామని వివరించారు. కేంద్రీయ విహార్‌లో ప్రజలను ఖాళీ చేయించి వారం పాటు బంద్ చేసి సహాయక చర్యలు చేపడతామని తెలిపారు. ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలకు ఆహారం, నీరు సరఫరా చేస్తున్నామని వెల్లడించారు.



కోగిలు గేటు సమీపాన ఓ రహదారిపై చేపలు పడుతున్న స్థానికులు

విమానాశ్రయ మార్గంలో పడవలు

బెంగళూరు (యలహంక): యలహంకలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి దారితీసే మార్గంలో ఉన్న వాడలు నీటిపాలయ్యాక.. సహాయక చర్యల కోసం మంగళవారం చిరు పడవలను రంగంలోకి దింపారు. కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్ మరోసారి మునిగిందన్న సమాచారంతో బృహత్ బెంగళూరు మహానగర పాలికె అధికారులు అప్రమత్తమయ్యారు. పదిరోజుల్లో వరుసగా మునుగుతునన కేంద్రీయ విహార్‌లో ఇక నివాసం ఏమంత సురక్షితం కాదని.. ఖాళీ చేయించే పనుల వేగం పెంచారు. అక్కడ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించలేక పోయారని బాధితులు విరుచుకుపడుతున్నారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి పక్కనే ఉన్న రాజకాలువ పొంగి- కేంద్రీయ విహార్ గోడను ధ్వంసం చేసి- ఆ నివాసాలపై విరుచుకుపడింది. ఆ ప్రాంగణంలో ఆరడుగుల నీరు నిలబడిపోయినట్లు అధికారులు తెలిపారు. నీరు బయటకు పంపించే మార్గంలేక- చివరికి ప్రజలనే ఖాళీ చేయించారు. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పడవల సాయంతో బయటకు తీసుకొచ్చారు. వృద్ధులు, వివిధ వ్యాధులతో బాధపడుతున్న వృక్తులు, మహిళలు, బాలలను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. వారంతా చుట్టు పక్కల ప్రైవేట్ వసతి గృహాల్లో తలదాచుకుంటున్నారు. యలహంక చెరువుకు ఎగువన ఐదు చెరువులు నిండిపోవడంతో ఇంత ముప్పు ముంచుకొచ్చిందని యలహంక శాసనసభ్యుడు విశ్వనాథ్ విచారం వ్యక్తం చేశారు. ప్రజలను ఖాళీ చేయించి సమస్యను పరిష్కరించేందుకు శ్రమిస్తామన్నారు.



చెరువులా మారిన కోగిలు కూడలి పరిసరాలు



యలహంక సమీప కేంద్రీయ విహార్‌లో మంగళవారం ఉదయం పడవల రంగప్రవేశం

బీఎంసీఆర్‌సీలో దర్శన్‌కు వైద్యపరీక్షలు



దర్శన్‌ను వైద్య పరీక్షలకు తీసుకెళ్తున్న పోలీసులు

బళ్లారి, న్యూస్‌టుడే: రేణుకాస్వామి హత్య కేసులో నిందితుడిగా ఉన్న సినీనటుడు దర్శన్ బళ్లారి కేంద్ర కారాగారంలో వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. జిల్లా ఆసుపత్రి బాధ్యుడు డా.ఎన్.బసరెడ్డి, ట్రామాకేర్ న్యూరో సర్జరీ డా. విశ్వనాథ నేతృత్వంలో వైద్యులు పరీక్షలు నిర్వహించారు. కొన్ని రోజులుగా వెన్నునొప్పితో బాధపడుతున్న దర్శన్‌కు ఎం.ఆర్.ఐ., సీటీ స్కాన్ తీయించాలని సలహా మేరకు బీఎంసీఆర్‌సీలో పరీక్షించారు. దర్శన్‌ను ఆగస్టు చివరిలో బళ్లారి కేంద్రకారాగారానికి తరలించారు. జైల్లో ప్రత్యేక బ్యారెక్‌లో ఉంచారు. నెల రోజులుగా వెన్నునొప్పితో బాధపడుతున్నట్లు జైలు అధికారులకు తెలియజేయడంతో, ఇప్పటికే బీఎంసీఆర్‌సీ వైద్యులు రెండు సార్లు చికిత్స అందించారు. వెన్నునొప్పి తగ్గకపోవడంతో మంగళవారం సాయంత్రం డా.బసరెడ్డి నేతృత్వంలో డా.విశ్వనాథ తదితర వైద్యులు బళ్లారి కేంద్ర కారాగారానికి చేరుకుని సుమారు గంటకుపైగా పరీక్షలు నిర్వహించారు. పూర్తిస్థాయిలో చికిత్స చేయడానికి ఎం.ఆర్.ఐ., సిటీ స్కాన్ చేయాలని జైలు అధికారులకు సూచించారు. వైద్యుల సూచనతో దర్శన్‌ను రాత్రి 9 గంటలకు పోలీస్ బందోబస్తు మధ్య బళ్లారి బీఎంసీఆర్‌సీకి తీసుకుని వెళ్లారు. సుమారు గంటకుపైగా ఎం.ఆర్.ఐ, సిటీ స్కాన్ చేశారు. పరీక్షలు నిర్వహించే సందర్భంలో బీఎంసీఆర్‌సీ ఆసుపత్రి, స్కానింగ్ కేంద్రాల వద్ద ఎవరు దగ్గరికి రాకుండా నగర డీఎస్పీ చంద్రకాంత నందరెడ్డి నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. స్కానింగ్ కేంద్రంలో వైద్యులు, నిపుణుల వద్ద చరవాణులు లేకుండా పోలీసులు జాగ్రత్త పడ్డారు.

పరిశీలించిన సతీమణి

సినీ నటుడు దర్శన్‌కు వెన్నునొప్పితో బాధపడుతుండటంతో బళ్లారి బీఎంసీఆర్‌సీ ఆసుపత్రిలో ఎం.ఆర్.ఐ., సిటీ స్కాన్ చేస్తారని తెలుసుకున్న సతీమణి విజయలక్ష్మి దర్శన్, కుటుంబసభ్యులు మంగళవారం సాయంత్రం బళ్లారికి చేరుకున్నారు. మొదట భర్త దర్శన్‌తో మాట్లాడి, బీఎంసీఆర్‌సీకి వెళ్లి స్కానింగ్ కేంద్రం పరిశీలించారు. అనంతరం వైద్యులు సలహాలో రాత్రి 9 గంటలకు ఆసుపత్రికి దర్శన్‌ను తీసుకెళ్లారు. బీఎంసీఆర్‌సీ వద్దకు అభిమానులు తరలివచ్చారు. పోలీసులు దగ్గరికి రాకుండా నియంత్రణ చేశారు.

కబడ్డీ..కబడ్డీ..!

బళ్లారి వీఎస్కేయూలో ప్రారంభమైన పోటీలు



మాట్లాడుతున్న వీఎస్కేయూ ఉపకులపతి, చిత్రంలో రిజిస్ట్రార్ ఎస్.ఎన్.రుద్రేశ్, విశ్రాంత క్రీడాధికారి చంద్రశేఖర్‌గౌడ

బళ్లారి, న్యూస్‌టుడే: శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదపడుతాయని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని బళ్లారి విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి మునిరాజు పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలను ఉపకులపతి ప్రారంభించి మాట్లాడారు. శ్రద్ధగా క్రీడలను నేర్చుకొని ఆడాలి. క్రీడలతో హృదయ సంబంధ వ్యాధులకు దూరంగా ఉంటారని తెలిపారు. జీవితంలో క్రమశిక్షణ, గెలుపోటములను క్రీడలు నేర్పుతాయన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. వీఎస్కేయూ పరిపాలన విభాగం రిజిస్ట్రార్ ఎస్.ఎన్.రుద్రేశ్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఒత్తిడికి దూరంగా ఉండవచ్చన్నారు. క్రీడామైదానం, ప్రత్యేక భవనం నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామన్నారు. విశ్రాంత క్రీడాధికారి చంద్రశేఖర్‌గౌడ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో కబడ్డీ, ఖోఖో పోటీలను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. వీఎస్కేయూ క్రీడాధికారి డా.శశిధర్ కల్లూర్, అధికారి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగే పోటీలకు రాష్ట్రంలోని 15 విశ్వవిద్యాలయాలు నుంచి ఆటగాళ్లు పాల్గొన్నారు.



కబడ్డీలో పోటీ పడుతున్న బళ్లారి-కలబురగి విశ్వవిద్యాలయాల జట్లు

ఉత్సాహంగా కురుగోడు తాలూకా అథ్లెటిక్ పోటీలు



క్రీడాపోటీలను ప్రారంభించి ప్రసంగిస్తున్న మనోహర్, చిత్రంలో అధికారి కొట్రేష్, కాంద్ర సతీష్, నింగప్ప తదితరులు



క్రీడాకారుల కవాతు వీక్షిస్తూ గౌరవ వందనం స్వీకరిస్తున్న అధికారులు



1500 మీటర్ల పరుగులో ఉన్నత పాఠశాల బాలికలు

ఎండకు అల్లాడిన క్రీడాకారులు

బళ్లారి, న్యూస్‌టుడే: విద్యతోపాటు క్రీడలూ అవసరం. తాలూకా స్థాయి పోటీల్లో క్రీడాకారులు స్ఫూర్తితో పాల్గొనాలి.. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని జిల్లా క్రీడాశాఖాధికారి కొట్రేష్ క్రీడాకారులకు సూచించారు. కురుగోడు క్షేత్ర విద్యాశాఖ, వ్యాయామ శాఖ సంయుక్తంగా మంగళవారం జిల్లా క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన కురుగోడు తాలూకా క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావల్సిన పోటీలు మూడు గంటలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. తాలూకా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా, విభాగం, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి బళ్లారి జిల్లాకు కీర్తిప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు. న్యాయనిర్ణేతలు ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. జిల్లా ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు నింగప్ప మాట్లాడారు. క్రీడాకారులు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్తే చక్కటి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల సంఘం అధ్యక్షుడు డా.హనుమంతప్ప మాట్లాడుతూ క్రీడాకారులు కృషి, పట్టుదల, ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలన్నారు. అబ్రహం లింకన్ పలుమార్లు ఓటమి పాలైనా ఆత్మస్థైర్యం కోల్పోలేదు. చివరికి అమెరికా అధ్యక్షుడు అయ్యారు. థామస్ ఆల్వా ఎడిసన్ విద్యుత్తు దీపం కనుగొనడానికి పలుమార్లు విఫలమైనా పట్టువదలకుండా చివరికి కనుగొన్నారన్నారు. క్రీడాశాఖాధికారి కోట్రేష్ క్రీడా జెండాను ఎగుర వేయగా, బీఆర్‌వో మనోహర్ క్రీడాపోటీలను ప్రారంభించారు. అనంతరం 100, 400, 600, 1500, 3వేల మీటర్ల పరుగు పందేలను నిర్వహించారు. క్రీడాపోటీలకు పద్మారెడ్డి, నాగన్న, బసవరాజు, విరుపాక్షప్ప, సిద్ధలింగప్ప తదితరులు పాల్గొన్నారు





పరుగులో పోటీ పడుతున్న విద్యార్థులు

మూడు గంటల ఆలస్యం

కురుగోడు తాలూకా క్రీడాపోటీలు ఉదయం 10.30 గంటలకు జిల్లా క్రీడామైదానంలో ప్రారంభం కావాల్సి ఉండగా, మధ్యాహ్నం 1 గంటకు వేదిక ప్రారంభమైంది. మధ్యాహ్నం 1.30 గంటలకు మండుటెండలో క్రీడాపోటీలను ప్రారంభించారు. ఎండలకు క్రీడాకారులు పరుగులో సొమ్మసిల్లిపోయారు. ఎండలకు వ్యాయామ ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు.

బళ్ళారి
•బళ్ళారి •రాయచూరు



గణపయ్యకు..నవనీతశోభ

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: గొల్ల నరసప్ప కాలనీ వరసిద్ధి వినాయక ఆలయంలో గణపయ్యకు విశేష పూజలు జరిపారు. వెన్న (నవనీతం)తో అలంకరించారు. విద్యార్థులకు ప్రథమపూజితుడి పూజలు చేయించారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ, అర్చకుడు శ్రీనివాస ఆచార్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

← వరసిద్ధి గణపయ్యకు వెన్నతో అలంకరణ

ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు

హొసపేటె, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మూడు నియోజకవర్గాల్లో జరిగే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు అని ముఖ్యమంత్రి ఆర్థిక సలహాదారు బసవరాజ్ రాయరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. సండూరులో కాంగ్రెస్ బలంగా ఉంది, ఆ నియోజకవర్గాన్ని సునాయాసంగా సొంతం చేసుకుంటాం. ఇక చెన్నపట్టణ, శిగ్గావ్‌లో జేడీఎస్, భాజపా ఎమ్మెల్యేలు ఉండేవారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజలు ఎంతో సంతృప్తికరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో చెన్నపట్టణ, శిగ్గావ్‌లో కూడా పార్టీ అభ్యర్థులే గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి సంతోష్‌లాడ్‌కు సండూరు మంచి పట్టు ఉంది, ఆయన మార్గదర్శనంలో కార్యకర్తలు ముందుకు వెళతారని అన్నారు. గ్యారంటీలతో ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు రాలేదని తేల్చిచెప్పారు. గ్యారంటీలు ఐదేళ్లు కొనసాగుతాయని ఓ ప్రశ్నకు సమాధానం చెప్పారు.

మత్స్యకారుల పేర్ల నమోదుకు అవకాశం

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి మత్స్య సంపద పథకం, ప్రధాన మంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి పథకం కింద 2023-24 ఏడాది నుంచి 2026-27 చేపల పెంపకంతో ఉండే మత్స్య సహకార సంఘాలు, విక్రయదారులు, చేపలు సంస్కరణ వ్యాపారవేత్తలు పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖాధికారి శివణ్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం కోసం బళ్లారి, సిరుగుప్ప, కంప్లి, కురుగోడు తాలూకా అధికారులను సంప్రదించాలన్నారు

రేపు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి గ్రామీణ జెస్కాం వ్యాప్తిలోని 110/11కె.వి. ఉప కేంద్రంలో మరమ్మతులు జరుగుతుండటంతో ఈ నెల 24న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జెస్కాం అధికారి తెలిపారు. ఈ కేంద్రం పరిధిలోకి వచ్చే ఏళుబెంచి, సిద్ధమ్మనహళ్లి, యర్రంగలి, బసవణ్ణ క్యాంపు, భూలక్ష్మిక్యాంపు, తిమ్మలాపురం, కుడతిని, వేణివీరాపురం తదితర చుట్టుపక్కల గ్రామాలు, పారిశ్రామిక ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

సెలవులకు అనుమతి లేదు

బళ్లారి, న్యూస్‌టుడే: సండూరు విధానసభ ఉప ఎన్నిక సందర్భంగా ఎన్నికల్లో విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది ఉన్నతాధికారుల అనుమతి లేకుండా సెలవుపై వెళ్లకూడదు. విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది కేంద్ర స్థానంలో ఉండాలని జిల్లా పాలనాధికారి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తోందన్నారు.

కొప్పళలో 25న ఉద్యోగమేళా

గంగావతి,న్యూస్‌టుడే: కొప్పళలో ఈనెల 25న మినీ ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యోగ వినిమయ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, పీయూసీ, ఐటీఐ. డిప్లొమా, పదవీ, బీఈ ఎలక్ట్రికల్, ఎంఎస్సీ మేథమేటిక్స్ చదివిన అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. దాఖలాలు, వివరాలతో జిల్లా పరిపాలనా భవనంలోని మొదటి అంతస్తులో ఉన్న ఉద్యోగ కార్యాలయానికి రావాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 08539-220859ను సంప్రదించాలని కోరారు.

పారిశ్రామికవాడలో విద్యుత్తుకోతలపై నిరసన

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: ముండ్రిగి పారిశ్రామిక వాడలో కొన్నిరోజులుగా విద్యుత్తు కోతలు చేస్తున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని జిల్లా పరిశ్రమల సంఘం అధ్యక్షుడు రామచంద్ర, కార్యదర్శి వాసుదేవ్ నిర్వయ జెస్కాం ఇంజినీరుకు వినతిపత్రం అందజేసి సమస్యలు వివరించారు. అధికారి పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామని తెలియజేశారు. సంఘం పదాధికారులు నిర్మా నాగరాజు, వెంకటేశులు, అనిల్‌కుమార్, దొడ్డ బసవనగౌడ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 20 గొర్రెలు మృతి

హొసపేటె, న్యూస్‌టుడే: పిడుగుపాటు పొలంలో చెట్టుకింద ఉన్న 20 గొర్రెలు మృతిచెందిన ఘటన సోమవారం రాత్రి కూడ్లిగి తాలూకా జమ్మోబనహళ్లి మ్యాసరహట్టిలో జరిగింది. కాపరి గోవిందగ గిడ్డెయ్య గొర్రెలను మేపుకొని రాత్రి తిరిగొస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. తలదాచుకోవటానికి ఓ చెట్టుకింద గొర్రెలను ఆపాడు. ఆ సమయంలో చెట్టుపైన పిడుగు పడి 20 గొర్రెలు మృతిచెందాయి. కాపరి ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. కూడ్లిగి పశుసంవర్ధక, పోలీస్ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

గంగావతి,న్యూస్‌టుడే: పర్యావరణ సమతుల్యం కోసం వన్యప్రాణులను సంరక్షించాలని లోక్‌సభ సభ్యుడు రాజశేఖర్ హిట్నాళ పేర్కొన్నారు. ఆయన మంగళవారం కొప్పళలో అటవీ శాఖ నిర్వహించిన వన్యప్రాణుల సంరక్షణ చైతన్య వాక్‌థాన్‌లో పాల్గొని మాట్లాడారు. వన్యప్రాణులు ప్రకృతి ప్రసాదించిన కానుక అన్నారు. అవి తమదైన శైలిలో పర్యావరణ సమతౌల్యానికి సహకరిస్తాయన్నారు. ఇవి అంతరించక కాపాడి భావితరాలకు అందించాలన్నారు. ప్రజల్లో చైతన్యం కోసం అటవీశాఖ వన్యప్రాణుల సంరక్షణా వారోత్సవాలను ఆచరిస్తోందన్నారు. జిల్లా పాలనాధికారి నళిన్ అతుల్, జడ్పీ సీఈవో రాహుల్‌రత్నం పాండే, డీఎఫ్‌వో కావ్య చతుర్వేది పాల్గొన్నారు.

ఇంటి గోడ కూలి వృద్ధురాలి మృతి

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: హిరియూరు తాలూకా బ్యాదరహళ్లి గ్రామంలో ఇంటి గోడ కూలి మీనాక్షమ్మ(63) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం వారు తెలిపిన వివరాల మేరకు.. బ్యాదరహళ్లి గ్రామంలో మీనాక్షమ్మ నివాసముంటున్న ఇంటి గోడ వర్షాలకు తడిసి సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కూలడంతో మట్టిపెళ్లల కింద చిక్కుకొని ఆమె తీవ్రంగా గాయపడింది. పొరుగు ఇంటి వారు వెంటనే ఆమెను రక్షించి, హిరియూరు తాలూకా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స ఫలించక ఆమె రాత్రి మృతి చెందినట్లు తెలిపారు.

ఐయ్యనహళ్లిలో ఎలుగుబంటి సంచారం

చెళ్లకెర(చిత్రదుర్గం): హొళల్కెర తాలూకా ఐయనహళ్లి గ్రామంలో ఎలుగుబంటి సోమవారం రాత్రి సంచరించిందని గ్రామ ప్రజలు అటవీశాఖ అధికారులకు తెలిపారు. మంగళవారం అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో గ్రామం శివార్లలోని కుక్కదేశ్వరి దేవాలయం సమీపంలో ఎలుగుబంటి సంచరించడాన్ని గ్రామ ప్రజలు చూశారని తెలిపారు. గ్రామానికి సమీపంలో గుట్టలు ఉండి అక్కడ నుంచి ఎలుగుబంట్లు తరచుగా గ్రామాలకు వస్తున్నాయని, వెంటనే అటవీ శాఖ అధికారులు వాటిని పట్టుకొని దూరంగా తరలించాలని అధికారులకు కోరారు.

తుర్విహాళలో దొంగతనం.. దేవదుర్గలో స్వాధీనం

సింధనూరు: సింధనూరు తాలూకా తుర్విహాళ పోలీసులు చాకచక్యంగా దొంగను పట్టుకుని రూ.1.35 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం సింధనూరు డీఎస్పీ తళవార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ నెల 18న అర్ధరాత్రి తుర్విహాళలో కుష్టిగి ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న మహబూబ్ సాబ్ అనే వ్యక్తి ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో విలువైన బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. ఈ మేరకు ఆయన తుర్విహాళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి నిఘా వహించిన తుర్విహాళ పోలీసులు..పలు ఆధారాలతో కాపుగాచారు. పక్కా ప్రణాళికతో దేవదుర్గ తాలూకా గలగ గ్రామం వద్ద నిందితుడు నాగరాజ్‌ను పట్టుకున్నారు. అతని నుంచి మొత్తం ఆభరణాలు, ద్విచక్ర వాహనాన్ని వశపర్చుకుని అదుపులోకి తీసుకున్నారు. దొంగతనం జరిగి అయిదు రోజుల్లో కేసును ఛేదించిన తుర్విహాళ పోలీసులను సింధనూరు డీఎస్పీ తళవార్ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలతో పోలీసులు

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

22-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.92	1611.35
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	51,001	000
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	51,309	9,900
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.461	40.303

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

కోట్లు పోశారు.. నిర్వహణ మరిచారు

✦ సింథటిక్ క్రీడా మైదానం దుస్థితి ✦ కుంటలా మారినా ఆటస్థలం



బురదలోనే తాలూకా క్రీడాపోటీల ప్రారంభ వేదిక

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా క్రీడామైదానం అభివృద్ధికి కోట్లు ఖర్చు చేసినా..నిర్వహణ లోపంతో దుస్థితికి చేరుకుంటోంది. సింథటిక్ ట్రాక్ లేచిపోతోంది. సరైన నిర్వహణ లేకపోవడంతో బురద కుంటగా మారింది. పిచ్చి మొక్కలు పెరిగిపోయి క్రీడాకారులు వెళ్లడానికి భయపడే పరిస్థితి నెలకొంది. మంగళవారం తాలూకా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు బురదలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలో బళ్లారి జిల్లా క్రీడాకారులకు పెట్టింది పేరు. ..వీరికి కనీస సౌకర్యాలు కల్పించడానికి అప్పటి జిల్లా బాధ్య మంత్రి బి. శ్రీరాములు, జిల్లా పాలనాధికారి పవన్‌కుమార్ మాలపాటి సుమారు రూ.8.30 కోట్లతో హాకీ కోర్టు, క్రీడామైదానం అథ్లెటిక్‌కు సింథటిక్ ట్రాక్, సెలవు రోజుల్లో వినోదం కోసం చెరువును నిర్మించారు. అథ్లెటిక్ ట్రాక్ నిర్వహణ లోపంతో సింథటిక్ ట్రాక్ రెండేళ్ల కాకముందే లేచి పోతోంది. ట్రాక్ అంచులో వేసిన సిమెంట్ లేచి పోయింది. వర్షపునీరు బయటకు వెళ్లడానికి సరైన మురుగుకాలువ లేక నీరు నిలుస్తోంది.

పిచ్చి మొక్కలతో నిండిన క్రీడామైదానం

జిల్లా మైదానంలో 450 మీటర్ల సింథటిక్ ట్రాక్ వేశారు. మధ్యలో, చుట్టూ ఖాళీ స్థలం ఉండటంతో చిన్న అడవిని తలపించేలా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. కాలు తీసి వేస్తే విషపు పురుగులు ఎక్కడ కరుస్తాయోనని క్రీడాకారులు భయపడే పరిస్థితి నెలకొంది. మొక్కలు సింథటిక్ ట్రాక్ వరకు విస్తరించాయి. షాట్‌పుట్ ట్రాక్ వద్ద మొక్కలు పెరిగిపోయాయి. గుండు వేసిన తర్వాత గడ్డిలో కనిపించడం కష్టమైంది. జావెలిన్ త్రో ఆడే పరిస్థితి నెలకొంది. సింథటిక్ ట్రాక్ చుట్టుపక్కల వర్షపునీరు నిలబడి పోయి పైభాగంలో సింథటిక్ లేచిపోతోంది.



నిర్వహణ లోపంతో లేచిపోతున్న సింథటిక్ ట్రాక్







జిల్లా క్రీడామైదానంలో వర్షపునీరు నిలబడి బురదగా మారిన దృశ్యం

వర్షమొస్తే జలమయం

సోమవారం రాత్రి కురిసిన వర్షానికి క్రీడామైదానం బురదకుంటను తలపిస్తోంది. మంగళవారం కురుగోడు తాలూకా స్థాయి క్రీడాపోటీల ప్రారంభించడానికి వేదికను బురదలోనే వేశారు. క్రీడా జెండాను ఎగురవేయడానికి ముఖ్య అతిథులు, వ్యాయామ అధికారులు, బురద దాటక తప్పలేదు. క్రీడాకారులు సైతం బురదలోనే నడవాల్సి వచ్చింది. చివరికి వ్యాయామ ఉపాధ్యాయులు మధ్యలో రాళ్లు వేశారు. నిత్యం క్రీడామైదానంలో నిర్వహణకు ఐదు మంది డి.గ్రూపు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు రికార్డుల్లో చూపుతున్నా ఆచరణలో కనిపించడం లేదని వ్యాయామ ఉపాధ్యాయులు తెలియజేస్తున్నారు. దీనిపై క్రీడాశాఖాధికారిణి గ్రేసిని చరవాణిలో సంప్రదించగా స్పందించలేదు.

ఘనంగా కర్ణాటక రాజ్యోత్సవ ఆచరణ

మాన్వి, న్యూస్‌టుడే: కర్ణాటక రాజ్యోత్సవాన్ని ఘనంగా ఆచరించాలని నిర్ణయించారు. మంగళవారం తహసీల్దార్ గ్రేడ్-2 అబ్దుల్ వాహిద్ అధ్యక్షతన మండల రెవెన్యూ కార్యాలయం సభాంగణంలో నిర్వహించిన కన్నడ రాజ్యోత్సవ పూర్వ సమీక్షా సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. నవంబరు 1న తాలూకా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు తప్పనిసరిగా రాజ్యోత్సవాన్ని ఆచరించాలని, వివిధ శాఖ కార్యాలయాల వద్ద కన్నడ ధ్వజాన్ని ఎగురవేయాలని తహసీల్దార్ సూచించారు. వాయిద్యాల మధ్య కళాకారుల బృందాలతో కన్నడమాత చిత్రపటాన్ని ఊరేగించాలని, కన్నడ అభిమానులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కన్నడ చలన చిత్రాలను మాత్రమే ప్రదర్శించేలా చూడాలని కన్నడ సంఘాల సభ్యులు డిమాండు చేశారు. కన్నడ కోసం విశేషంగా కృషి చేసిన వారితో పాటు ప్రతిభావంత విద్యార్థులను సత్కరించాలని సభలో తీర్మానించారు. బీఈఓ చంద్రశేఖర్, టీపీ ఈఓ ఖాలిద్ ఖాద్రి, ఎస్టీ శాఖ అధికారి మహాలింగప్ప, సమాజ కల్యాణాధికారి నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాహిద్

పంటల పరిహారం కోసం ధర్నా

మాన్వి, న్యూస్‌టుడే: జిల్లాలోని సాత్‌మైల్ నుంచి సింధనూరు వరకు చేపట్టిన నాలుగు వరసల రహదారికి సంబంధించి భూ, పంటల పరిహారం తేలేవరకు పనులు చేయవద్దంటూ కపగల్ పరిధి రైతులు అడ్డుకున్నారు. రహదారి నిర్మాణానికి అవసరమైన భూమి, సరిహద్దులను గుర్తించడంలో తేడాలున్నాయని ఆరోపించారు. వేలాది రూపాయిలు పెట్టుబడి పెట్టిన పంటలకు నష్టం వాటిల్లుతుందని వాపోయారు. గుత్తేదారే సరిహద్దు రాళ్లని వేస్తున్నారని, ఇది సరికాదన్నారు. సంబంధిత ప్రభుత్వ అధికారులు, సర్వే సిబ్బంది లేకుండా ఇష్టానుసారంగా ఏవిధంగా సరిహద్దులు నిర్ణయిస్తారని నిలదీశారు. ఈ సందర్భంగా రాయచూరు సహాయక అధికారి గజానన బాలె రైతుల వద్దకు వచ్చి చర్చించారు. తహసీల్దారు రాజు ఫిరంగి, డీఎస్పీ బి.ఎస్.తళవార్, పీఐ వీరభద్రయ్య హిరేమఠ, ఆర్.ఐ. చరణ్‌సింగ్, రైతు ప్రముఖులు హనుమంతరాయ, ఆంజినేయ యాదవ్, చందప్పనాయక్, లక్ష్మీకాంత్ బొమ్మనాళ, సురేష్‌గౌడ, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా నేతల ప్రచారం

బళ్లారి, న్యూస్‌టుడే: సండూరు అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల ప్రచారాన్ని భాజపా నాయకులు రెండో రోజు కొనసాగించారు. భాజపా అభ్యర్థి బంగారు హనుమంత నేతృత్వంలో మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి, భాజపా జిల్లా, తాలూకా అధ్యక్షులు, మండలి అధ్యక్ష, బూత్‌స్థాయి అధ్యక్షులతో కలిసి మంగళవారం ప్రచారం చేశారు. మత్తజనహళ్లి, శెలియప్పనహళ్లి, తూకెనహళ్లి, బుడ్డేనహళ్లి, ఓబళాపుర, గౌరిపుర, జిగేనహళ్లి, త్యాగదాళ్, తప్పమరడి, హిరాళ్, దేవర మల్లాపుర, అంకమ్మనాళ్ తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నేతలను పార్టీకి చేర్చుకున్నారు. భాజపాకు ఒక్క సారి అవకాశం ఇవ్వండి..సండూరు తాలూకాను అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు.



ఇంటింటి ప్రచారంలో అభ్యర్థి బంగారు హనుమంత, మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి

కంప్లి- గంగావతి మార్గంలో రాకపోకలు బంద్

కంప్లి, న్యూస్‌టుడే: తుంగభద్ర నదికి వరద పెరగడంతో కంప్లి - గంగావతి మార్గంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. కంప్లి కోటె వంతెనకు సమాంతరంగా నీరు ప్రవహిస్తోంది. ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోవడంతో కడెబాగిళు - బుక్కసాగర మీదుగా తిరిగి వెళ్లాల్సి వస్తుంది. ఈ సంవత్సరం ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోవడం ఇది రెండోసారి.



కంప్లికోటె వంతెన వద్ద తుంగభద్రమ్మ పరవళ్లు



వంతెన వద్ద నీటి ప్రవాహం పెరగడంతో వాహన సంచారాన్ని అప్రమత్తం చేస్తున్న అధికారులు



నగరసభ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న రక్షణా వేదిక నాయకులు

రహదార్లపై వరద నీటిని అరికట్టండి

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు పట్టణంలో చిన్న చినుకు పడితే చాలు..గంగావతి మార్గంలో హోలీ ఫ్యామిలీ పాఠశాల ఎదుట, రాయచూరు మార్గంలో పీడబ్ల్యూడీ క్యాంపులోని కన్యకా పరమేశ్వరి, ఎల్లమ్మ దేవస్థానాల ఎదుట రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. వాహనాలు తీసుకెళ్లాలంటేనే భయంగా ఉంది..చర్యలు చేపట్టాలని కర్ణాటక రక్షణా వేదిక (శివరామేగౌడ) నాయకులు నగరసభను అభ్యర్థించారు. ఈ మేరకు కమిషనర్ మంజునాథ్ గుండూరుకు మంగళవారం ఓ వినతిపత్రం సమర్పించారు. మినీవిధానసౌధ ఎదుట వృథాగా ఉన్న బస్సు షెల్టర్ అక్రమ కార్యక్రమాలకు నెలవుగా మారింది. దీనిని పోరాట సంఘాలకు వేదికగా ఇస్తే మంచి కార్యాలకు ఉపయోగకరం అవుతుందని అభ్యర్థించారు. పాదచారి మార్గాలపై ఉన్న చిరు వ్యాపారులకు అనువైన స్థలాన్ని చూపించాక ఖాళీ చేయమని తాఖీదులు జారీ చేయడం సబబు. వీటిపై తగు చర్యలు తీసుకోవాలని కరవే నాయకులు దవల్‌సాబ్ దొడ్డమని, హనుమేశ్ తిప్పనట్టి, శ్రీకాంతరెడ్డి, మహబూబ్‌సాబ్, విఘ్నేశ్ వినతిపత్రం అందించారు.

మద్యవిముక్తి శిబిరాలు..కుటుంబాలకు దారి దీపాలు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: మద్యవిముక్తి శిబిరాలతో దాని బారి నుంచి బయటపడిన వారి కుటుంబాలకు దారి దీపాలుగా మార్గదర్శనం చేస్తున్నాయని ఏపీఎంసీ మాజీ సభ్యుడు నరేంద్రసింహ పేర్కొన్నారు. పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ధర్మస్థల గ్రామీణ అభివృద్ధి సంస్థ, బీసీ ట్రస్ట్, బెళ్తంగడి అఖిల కర్ణాటక మద్యవిముక్తి వేదిక, వ్యవస్థాపక సమితి, స్థానిక స్వసహాయ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. మద్యపానంతో ఆరోగ్యం, ఆర్థికంగా మనుషులు ఇబ్బందులకు గురై అన్ని విధాలుగా ఇబ్బందులు పడుతున్నారు. వ్యసనంతో మృతి చెందితే కుటుంబాలు అనాథలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వివిధ సేవా సంస్థల ప్రతినిధులు కిరణ్‌కుమార్ జైన్, ముత్యాలయ్య శెట్టి, శివశంకర రెడ్డి, కోటిరెడ్డి, రాజకుమార్, సుధీర్ హంగళూరు పాల్గొన్నారు.



సిరుగుప్ప కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు



హొసపేటె పట్టణానికి వచ్చిన కన్నడ రథానికి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

కన్నడ రథానికి ఘన స్వాగతం

హొసపేటె, న్యూస్‌టుడే: వచ్చే నెల చక్కెర నగరి మండ్యలో నిర్వహించే 87వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కన్నడ కథ యాత్ర మంగళవారం పర్యాటక నగరి హొసపేటెకు వచ్చింది. పునీత్‌రాజ్‌కుమార్ కూడలి వద్ద కన్నడ రథానికి జిల్లా యంత్రాంగం, పలు కన్నడపరమైన సంఘటనల సభ్యులు ఘన స్వాగతం పలికారు. రథానికి పుష్పార్చన చేసి భాషాభిమానాన్ని చాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గవియప్ప, జిల్లాపాలనాధికారి ఎం.ఎస్.దివాకర్, కన్నడ, సాంస్కృతిక శాఖ సహాయక సంచాలకుడు సిద్ధలింగేశ రంగణ్ణనవర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రథం కొప్పళ జిల్లావైపు సాగింది.

జనజీవనం అతలాకుతలం



మునిగిన నాయకనహట్టిలో తిప్పేరుద్రస్వామి హొరమఠం ప్రాంగణం

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: చెళ్లకెర తాలూకాలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో పెద్ద ఎత్తున ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లింది. మంగళవారం అధికారులు అందించిన వివరాల మేరకు.. చెళ్లకెరతో పాటు ఇతర తాలూకాల్లో కుండపోత వర్షాలు కురిశాయి. అత్యధికంగా నాయకనహట్టిలో 60 మి.మీ. వర్షపాతం నమోదైంది. వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు 25 సంవత్సరాల తర్వాత నాయకనహట్టి చెరువు భర్తీ అయింది. వరదనీరు పోటెత్తడంతో చెరువు నుంచి అదనపు వరదనీరు మరవ గుండా దిగువ వాగులోనికి పరవళ్లు తొక్కింది. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. సోమవారం అర్ధరాత్రి సమయానికి నాయకనహట్టిలో ప్రసిద్ధి చెందిన పుణ్య క్షేత్రం తిప్పేరుద్రస్వామి హొరమఠం దేవాలయం ప్రాంగణంలోకి వరదనీరు చేరింది. పోలీసు ఠాణాలో దస్త్రాలు తడిచిపోయాయి. నాయకనహట్టికి సమీపంలోని ఎన్.మహదేవపురం గ్రామానికి చెందిన శివానందప్ప కోళ్ల ఫాంలోనికి వరద చేరడంతో వేలాది కోళ్లు మృతి చెందాయి. కొత్తగా నిర్మించిన కాలనీలోని పలు గృహాల్లోకి నీరు చేరింది.

దెబ్బతిన్న 120 గృహాలు

చెళ్లకెర తాలూకాలో 40 గృహాలకు హాని కలుగగా, చిత్రదుర్గంలో 35, హొళల్కెరెలో 13, మొళకాల్మూరులో 12,హిరియూరులో11, హొసదుర్గంలో 9 గృహాలు దెబ్బతిన్నాయి. తాలూకాలో వరదనీటిలో 7 గొర్రెలు కొట్టుకొని పోయి మృతి చెందాయని తెలిపారు. వర్షాలకు సుమారు 25 ఎకరాల్లో ఉద్యానవన పంటలు, 20 ఎకరాల్లో పంటలు నీట మునిగాయని చెప్పారు.



నాయకనహట్టి పోలీసు ఠాణా భవనంలోకి ప్రవేశించిన నీరు



కోళ్ల ఫాంలో మృతి చెందిన కోళ్లు

వాగులో కొట్టుకొని పోయిన కారు

అర్ధరాత్రి సమయంలో వరద ఉద్ధృతి విషయం తెలియని కారులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులు చెరువు మరవ వద్ద రహదారిని దాటడానికి ప్రయత్నించగా , కారు వరద నీటిలో చిక్కుకొని దిగువకు సుమారు 50 మీటర్ల మేరకు వాగులో కొట్టుకొని పోయింది. దిగువున ఉన్న గొట్టపు బావి కారుకు అడ్డుపటంతో కారులో ప్రయాణించుచున్న వారు అతి కష్టంపై తలుపులు తీసుకొని బయటకు వచ్చారు. చిమ్మ చీకట్లో , వర్షంలో దిక్కు తోచక వాగు మధ్యన చెట్లను పట్టుకొని రక్షణ పొందారు. వీరిలో ఒకరు అతి కష్టంపై ఈదుకొంటూ ఒడ్డు చేరుకొని సమీపంలోని బోసదేవరహట్టి గ్రామస్థులను తీసుకొచ్చి తాళ్ల సాయంతో వాగులో చిక్కుకొన్న ముగ్గురిని రక్షించారు.



నాయకనహట్టి చెరువు నిండి రోడ్డుపై ప్రవహిస్తున్న వరద

నేలకొరిగిన వరి పంట



ఉళేనూరు వద్ద నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు ←

కారటగి : కారటగి తాలూకాలో ఆదివారం రాత్రి ఈదురుగాలులు, వర్షానికి నదీ తీర ప్రాంతంలో వరి పంట నేల కొరిగింది. అధికారులు రెండు రోజులుగా పంట నష్టాన్ని పరిశీలిస్తున్నారు. తహసీల్దార్ ఎం.కుమార స్వామి మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఉళేనూరు ప్రాంతంలో ఈదురు గాలులకు వరి పంట నేల కొరిగింది. వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి నష్టం వివరాలు సేకరిస్తున్నాం. రెండు రోజుల్లో సమీక్ష పూర్తి చేసి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

నగరం.. వాననీటి సాగరం



విలాసవంతమైన ఓ వాడను నిలువునా ముంచిన వాననీరు



గాంధీకృషి విజ్ఞాన కేంద్రంలో వరద తీవ్రతకు కొట్టుకుపోయిన ప్రహరీ

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఎడతెరిపిలేని వర్షానికి సగం బెంగళూరు ముంపులో కొట్టుమిట్టాడుతోంది. రహదారులు వాగులను తలపించాయి. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అపార్ట్‌మెంట్లలోకి నీరు ప్రవహించడంతో పార్కింగ్ చేసిన వాహనాలు నీటిలో తేలాయి. కొన్ని కొట్టుకుపోయి.. దూరంగా ఆగాయి. విద్యుత్తు సరఫరా నిలిచి పోవడంతో ప్రజల కష్టాలు వర్ణనాతీతం. నీటిలో చిక్కిన ప్రజలను ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పడవల సాహాయంతో బయటకు తరలించారు. ఉత్తర బెంగళూరు పరిధిలోని యలహంక, టాటానగర, భద్రప్పలేఅవుట్, ఆట్టూరు, కువెంపునగర, దాసరహళ్లి, సర్జాపుర, రెయిన్‌బో డ్రైవ్ లేఔట్ మరోసారి ముంపు ముప్పుపాలయ్యాయి. విల్లాల్లోకి నీరు ప్రవహించడంతో ప్రజలు భయాందోళనలకు లోనయ్యారు. మంగళవారం ఉదయం కొన్ని విల్లాలను ఖాళీ చేసి ప్రజలు సమీపంలో ఉన్న హోటళ్లకు వెళ్లి తలదాచుకున్నారు. టాటానగర పూర్తిగా నీటిమయం కావడంతో ప్రజలకు పాలికె సిబ్బంది తాగునీటి సీసాలు, భోజనం పొట్లాలను సమకూర్చింది. వరద పీడిత ప్రాంతాన్ని రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ పరిశీలించారు. నీరు ఎక్కువగా ఉండటంతో పాలికె చీఫ్ కమిషనర్ తుషార్‌గిరినాథ్ ట్రాక్టర్ ఎక్కి ముంపు ప్రాంతాల్లో పరిస్థితి తెలుసుకున్నారు. విద్యారణ్యపుర, కువెంపునగరలో రహదారులు కాలువలుగా మారిపోయాయి. సర్జాపుర రహదారి దుస్థితి వర్ణనాతీతం. నగరవ్యాప్తంగా సంచార రద్దీ ఏర్పడింది. లోతట్టు ప్రదేశం భద్రప్ప లేఔట్ ఇళ్లు పడవల్లా కనిపించాయి. హెబ్బాళ్ రింగ్‌రోడ్డు కూడలిలో రాజకాలువలు పొంగి ప్రవహించాయి.

● మంగళవారం ఒక్కరోజే నాలుగువేల ఇళ్లలోకి నీరు చేరినట్లు పాలికె చీఫ్ కమిషనర్ తుషార్‌గిరినాథ్ తెలిపారు. పది లేఅవుట్లలో ఈ ప్రభావం ఎక్కువగా ఉందని, నిలబడిన నీటిని యంత్రాల సాహాయంతో బయటకు పంపిస్తున్నామని వివరించారు. కేంద్రీయ విహార్‌లో ప్రజలను ఖాళీ చేయించి వారం పాటు బంద్ చేసి సహాయక చర్యలు చేపడుతామని తెలిపారు. ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలకు ఆహారం, నీరు సరఫరా చేస్తున్నామని వెల్లడించారు.



కోగిలు గేటు సమీపాన ఓ రహదారిపై చేపలు పడుతున్న స్థానికులు



యలహంక సమీప కేంద్రీయ విహార్‌లో మంగళవారం ఉదయం పడవల రంగప్రవేశం



కన్నూర్ రహదారి పూర్తిగా జలమాయం

విమానాశ్రయ మార్గంలో పడవలు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : యలహంకలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి దారితీసే మార్గంలో ఉన్న వాడలు నీటిపాలయ్యాక.. సహాయక చర్యల కోసం మంగళవారం చిరు పడవలను రంగంలోకి దింపారు. కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్ మరోసారి మునిగిందన్న సమాచారంతో బృహత్ బెంగళూరు మహానగర పాలికె అధికారులు అప్రమత్తమయ్యారు. పదిరోజుల్లో వరుసగా మునుగుతునన కేంద్రీయ విహార్‌లో ఇక నివాసం ఏమంత సురక్షితం కాదని.. ఖాళీ చేయించే పనుల వేగం పెంచారు. అక్కడ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించలేక పోయారని బాధితులు విరుచుకుపడుతున్నారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి పక్కనే ఉన్న రాజ కాలువ పొంగి- కేంద్రీయ విహార్ గోడను ధ్వంసం చేసి- ఆ నివాసాలపై విరుచుకుపడింది. ఆ ప్రాంగణంలో ఆరడుగుల నీరు నిలబడిపోయినట్లు అధికారులు తెలిపారు. నీరు బయటకు పంపించే మార్గంలేక- చివరికి ప్రజలనే ఖాళీ చేయించారు. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని పడవల సాహాయంతో బయటకు తీసుకొచ్చారు. వృద్ధులు, వివిధ వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులు, మహిళలు, బాలలను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. వారంతా చుట్టు పక్కల ప్రైవేట్ వసతి గృహాల్లో తలదాచుకుంటున్నారు. యలహంక చెరువుకు ఎగువన ఐదు చెరువులు నిండిపోవడంతో ఇంత ముప్పు ముంచుకొచ్చిందని యలహంక శాసనసభ్యుడు విశ్వనాథ్ విచారం వ్యక్తం చేశారు. ప్రజలను ఖాళీ చేయించి సమస్యను పరిష్కరించేందుకు శ్రమిస్తామన్నారు.

● అంతర్జాతీయ విమానాశ్రయం రహదారిలోని లోతట్టు ప్రదేశం.. కోగిలు కూడలి పూర్తిగా ముంపునకు గురైంది. యలహంక కెంపేగౌడ కూడలి నుంచి కోగిలు కూడలి వరకు అర్ధకిలోమీటరు పెద్ద నదిని తలపించింది. కోగిలు కూడలి- యలహంక రైల్వేస్టేషన్ మారర్గంలో రెండు అడుగుల వాననీరు నిలిచిపోయింది. అక్కడ ఓ బీఎంటీసీ బస్సు గుంతలో పడిపోవడంతో క్రేన్ సాహాయంతో బయటకు తీశారు. ఆ నీటిలో విపరీతంగా చేపలు కనిపించడంతో యువకులు వలలతో సందడి చేయడం కనిపించింది. ఒక్క యలహంకలోనే 154.67 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. ఆట్టూరు, విద్యారణ్యపుర, దొడ్డబొమ్మసంద్ర తదితర ప్రాంతాల్లో పలుప్రదేశాలు ముంపుపాలయ్యాయి.



చెరువులా మారిన కోగిలు కూడలి పరిసరాలు



సర్జాపుర రహదారిలోని రెయిన్‌బో డ్రైవ్ లేఅవుట్ నీటిపాలు



రెయిన్‌బో డ్రైవ్ లేఅవుట్ వరదలో చిక్కిన యువకుడి అగచాట్లు

వణికిస్తున్న తుంగభద్ర



కంప్లికోటె వంతెన వద్ద తుంగభద్రమ్మ పరవళ్లు

కంప్లి, న్యూస్‌టుడే: తుంగభద్ర నదికి వరద పెరగడంతో కంప్లి - గంగావతి మార్గంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. కంప్లి కోటె వంతెనకు సమాంతరంగా నీరు ప్రవహిస్తోంది. ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోవడంతో కడెబాగిళు - బుక్కసాగర మీదుగా తిరిగి వెళ్లాల్సి వస్తుంది. ఈ సంవత్సరం ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోవడం ఇది రెండోసారి.



వంతెన వద్ద నీటి ప్రవాహం పెరగడంతో వాహన సంచారాన్ని అప్రమత్తం చేస్తున్న అధికారులు

బంగ్లాదేశీయులకు కటకటాలు

హాసన, న్యూస్‌టుడే : దేశంలోకి అక్రమ మార్గంలో చొరబడి, నకిలీ ఆధార్, ఇతర గుర్తింపు కార్డులను చేయించుకుని ఉంటున్న ముగ్గురు బంగ్లాదేశీయులను హాసన పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. జమాలి అలి, ఫారుక్ అలి, అక్మల్ హొక్కులను నిందితులుగా గుర్తించారు. పశ్చిమ బెంగాల్ చిరునామాతో వారు ఆధార్ కార్డులను చేయించుకున్నారు. భవన నిర్మాణ కార్మికులుగా ఉపాధి కల్పించుకున్నారు. నిందితుల నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు పెన్షన్ మొహల్లా ఠాణా పోలీసులు విచారణ చేపట్టారు.

వసతి గృహంలో విద్యార్థిని దుర్మరణం

బెళగావి, న్యూస్‌టుడే : చిక్కోడి తాలూకా హిరేకొడి గ్రామంలోని ప్రభుత్వ హాస్టల్ మొదటి అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందకు దూకి ఆఫ్రిన్ జమాదార్ (17) అనే విద్యార్థిని మరణించింది. మంగళవారం పరీక్షలకు సిద్ధమయ్యేందుకు మేడపై సోమవారం అర్ధరాత్రి వరకు చదువుకుంది. నిద్ర మత్తులో కిందకు దిగుతూ కిందకు పడిపోయింది. తలకు తీవ్ర గాయాలైన బాధితురాలిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా మరణించింది. చిక్కోడి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మెట్రో ధరలపై అభిప్రాయ సేకరణ

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : నమ్మ మెట్రో ప్రయాణ ధరను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ధర పరిష్కరణకు ఒక సమితిని ఏర్పాటు చేసింది. ప్రయాణికులు, ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని సమితి ఇప్పటికే కోరింది. సోమవారంతో గడువు ముగియడంతో మరికొందరి అభిప్రాయాలు, సూచనలు, ఆక్షేపణలు తెలుసుకునేందుకు గడువును ఈ నెల 28 వరకు పొడిగించారు. ఇప్పటి వరకు 2000 మంది తమ ఆక్షేపణలను గుర్తించారు. ఇ-మెయిల్ లేదా లేఖ రూపంలో అధ్యక్షుడు, ధర నిర్ణయ సమితి, నమ్మ మెట్రో, 3వ అంతస్తు, సీ బ్లాక్, బీఎంటీసీ సముదాయం, కేహెచ్ రోడ్డు, శాంతినగర, బెంగళూరు-560 027కు పోస్టు, కొరియరు లేదా స్వయంగా ఇవ్వవచ్చు. వాట్సప్ ద్వారా అభిప్రాయాలు, సూచనలు పంపదలచిన వారు 9448291173 నంబరుకు పంపించవచ్చని అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీపై దాడి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : బాలలకు సరిగ్గా ఆహారాన్ని అందించడం లేదని ఆరోపిస్తూ అంగన్‌వాడీ కార్యకర్త సంపత్తిపై యండ్రామి తాలూకా ఆలూరు గ్రామంలో మల్లప్ప నాటికార్ అనే ఉపాధ్యాయుడు దాడి చేశాడు. ఆమెను కులం పేరిట దూషిస్తూ అందరి ముందు కొట్టాడు. బాధితురాలి ఫిర్యాదుతో మల్లప్పపై యండ్రామి ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

హాసనాంబ వేడుకలకు సన్నాహాలు

హాసన, న్యూస్‌టుడే: హాసన నగర అధిదేవత హాసనాంబ జాతర మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా ఆశ్వయుజ మాసం పూర్ణమి అనంతరం వచ్చే మొదటి గురువారం హాసనాంబ ఆలయం తలుపులు తెరుస్తారు. ఈ ఏడాది తొమ్మిది రోజులు మాత్రమే అమ్మవారిని దర్శించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ ఏడాది కనీసం 20 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని అంచనా. ఉచిత దర్శనంతో పాటు రూ. 300, రూ. 1000 టికెట్లపై దర్శనాలకు అవకాశం కల్పిస్తున్నామని జిల్లా పాలన యంత్రాంగం తెలిపింది.



కోవెలలో కొలువుదీరిన హాసనాంబ

ఉపసమరంలో తలపడే నేతలెవరో!

ఈనాడు, బెంగళూరు : ఉప ఎన్నికల కోసం రాజకీయ పార్టీల వ్యూహాలు తారాస్థాయికి చేరుకున్నాయి. మూడు నియోజకవర్గాల్లో గెలుపోటములను ప్రతిష్ఠగా భావిస్తున్న పార్టీలు అభ్యర్థుల ఎంపిక కోసం ముప్పుతిప్పలు పడుతున్నాయి. ఇప్పటి వరకు భాజపా నుంచి శిగ్గావ్, సండూరు కోసం అభ్యర్థులను మాత్రమే ఖరారు చేయగా కాంగ్రెస్ ఏ ఒక్క అభ్యర్థి పేరూ ప్రకటించలేదు. కీలకమైన చెన్నపట్టణలో రాజకీయ చదరంగం కొనసాగుతూనే ఉంది. భాజపా ఎమ్మెల్సీ సి.పి. యోగేశ్వర్ రాజీనామాతో మూడు పార్టీల వ్యూహాలన్నీ ఒక్కసారిగా తారుమారు కావటంతో ఆ చోటు కోసం అభ్యర్థుల ఎంపికపై చర్చల వేదిక దిల్లీకి మారింది. సోమవారం విపక్ష నేత ఆర్.అశోక్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర దిల్లీలో పార్టీ పెద్దలతో చర్చలకు హాజరయ్యారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నుంచి అభ్యర్థుల ఎంపికపై చర్చలు జాతీయ నేతల దృష్టికి వెళ్లాయి. వయనాడ్‌లో నామినేషన్ కోసం వస్తున్న ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ తదితరులతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అభ్యర్థుల విషయంపై చర్చించనున్నారు. ఈ చర్చల కోసమే ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులు మైసూరు నుంచి కేరళలోని వయనాడ్‌కు వెళ్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

నేడు స్పష్టత

చెన్నపట్టణలో ఎన్‌డీఏ అభ్యర్థి, మూడు క్షేత్రాలకు కాంగ్రెస్ అభ్యర్థులెవరో మంగళవారం రాత్రి ఓ స్పష్టత వస్తుందనే అందరూ భావించారు. రాత్రి పొద్దుపోయేంత వరకు పార్టీ నేతలెవ్వరూ నోరు మెదపలేదు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాత్రం సండూరులో బళ్లారి ఎంపీ తుకారామ్ భార్య అన్నపూర్ణకు టికెట్ ఇవ్వాలని పార్టీ నిర్ణయించినట్లు తెలిపినా.. అధికారంగా ఆమె పేరు వెల్లడి కాలేదు. చెన్నపట్టణలోనూ ఎమ్మెల్సీ సభ్యత్వానికి రాజీనామా చేసిన సి.పి.యోగేశ్వర్‌ను ఆహ్వానించేందుకు కాంగ్రెస్ సిద్ధమైనా ఆయన రాకపై స్పష్టత రాలేదు. మరోవైపు జేడీఎస్ రంగంలోకి దిగి యోగేశ్వర్‌ను ఎన్‌డీఏ అభ్యర్థిగా జేడీఎస్ గుర్తుతో పోటీ చేయాలని మనవి చేసినట్లు పార్టీ నేత కుమారస్వామి మరోసారి వెల్లడించారు. ఆ స్థానంలో అభ్యర్థిని కుమారస్వామి మాత్రమే వెల్లడిస్తారని భాజపా నేతలు చెప్పినా మంగళవారం వరకు స్పష్టత రాలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో బుధవారం మూడు పార్టీల నుంచి స్పష్టమైన సమాచారం రానుందని తెలుస్తోంది. నామినేషన్‌కు ఈనెల 25న తుది గడువు కావటంతో నేడు, రేపటిలోగా అభ్యర్థులు తేలాల్సి ఉంది.

హోదా మరచిపోయిన కుమార: చెలువరాయ

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ప్రభుత్వం త్వరలో పతనమవుతుందని కేంద్ర మంత్రి కుమారస్వామి పదే పదే వ్యాఖ్యలు చేయడాన్ని వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి ఖండించారు. ఆయన తన బాధ్యత, హోదా, అధికారాన్ని మరచి ఇలా మాట్లాడడం తగదని హితవు పలికారు. ఆయన బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో 123 సీట్లు రాకపోతే జనతాదళ్‌ను రద్దు చేస్తామని ప్రకటించిన కుమారస్వామి ఆ మాట ఎందుకు నిలుపుకోలేదని ప్రశ్నించారు. ఆరోపణలు చేయడం, మాట మార్చడం, తప్పించుకుని పోవడం ఆయనకు అలవాటేనని తూర్పారబట్టారు. కార్యకర్తలు, నాయకుల హితాన్ని పక్కన పెట్టి సొంత ప్రయోజనాలకే కుమారస్వామి ప్రాధాన్యమిస్తారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి 136 మంది ఎమ్మెల్యేల బలం ఉన్నప్పుడు ప్రభుత్వం ఎలా పతనమవుతుందో చెప్పాలని సవాలు విసిరారు. రాజకీయాలను పిల్లలాటగా ఆయన భావిస్తున్నట్లు ఉందన్నారు. మా పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. మూడు నియోజకవర్గాలకు జరుగుతున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా తామంతా పని చేస్తామని చెప్పారు.

పోటీకి భరత్ అర్హుడే

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : శిగ్గావ్ ఉప ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై కుమారుడు భరత్‌కు భాజపా టికెట్ ఇవ్వడం సబబేనని విధానసభలో ఉప విపక్ష నాయకుడు అరవింద్ బెల్లద్ వ్యాఖ్యానించారు. ఈ అంశాన్ని కుటుంబ, వారసత్వ రాజకీయాలుగా పరిగణించరాదని వివిధ పార్టీల నాయకులకు హితవు పలికారు. రాష్ట్ర, జాతీయ నాయకులు అన్ని అంశాలూ పరిగణనలోకి తీసుకుని, సుదీర్ఘంగా చర్చించిన అనంతరమే భరత్‌కు అవకాశమిచ్చారని చెప్పారు. ఉప ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా భాజపా నాయకులందరూ పని చేస్తున్నామని తెలిపారు.



ఆలయంలో నాగ శిల

రాత్రికి రాత్రే ఆలయ నిర్మాణం!

ధార్వాడ, న్యూస్‌టుడే : నాగపంచమికి ముందు రోజు పెరటి నడకదారిలో వచ్చిన ఒక నాగుపామును హనుమంత జాధవ్ కట్టెతో కొట్టి చంపారు. దానికి తమ పద్ధతిలో సంస్కారం చేసి నిప్పుపెట్టినా.. అది పూర్తిగా కాలలేదు. ఆ తర్వాత వారానికి ఆయన ఇంట్లోని 11 ఏళ్ల బాలికను మరో పాము కనిపించింది. తమకూ పాము కనిపిస్తోందని కుటుంబ సభ్యులు చెప్పడంతో ఆయన ఆలోచనలోపడ్డారు. పాము పగ పడుతుందన్న విశ్వాసం గుర్తుకొచ్చి నిద్ర కూడా పట్టలేదు. వర్షాలు కురుస్తూ ఉండడంతో పుట్టల్లోకి నీరు చేరుకుని పాములు బయటకు రావడంతో స్థానికులు భయపడ్డారు. దీనికి పరిహారంగా నాగ మందిరం కట్టిస్తానని హనుమంత జాధవ్ మొక్కుకున్నారు. తనకు ఉన్న స్థలంలో ఆలయ నిర్మాణానికి కావలసిన సన్నాహాలు చేసుకున్నారు. బండరాళ్లు, ఇసుక, సిమెంటుతో పాటు ప్రతిష్ఠాపించేందుకు నాగశిల సిద్ధం చేశారు. రాత్రికి రాత్రి తన కుటుంబ సభ్యులతో కలిసి చిన్న ఆలయాన్ని నిర్మించి, నాగశిలను అందులో ప్రతిష్ఠాపించారు. కలఘటగి తాలూకా గణిళి హోలకొప్ప గ్రామంలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. జాధవ్ కుటుంబానికి చుట్టుపక్కల నివాసాల వారు సహకారాన్ని అందించారు.

కుమారుడు మరణం..తండ్రి విషాదాంతం

హావేరి, న్యూస్‌టుడే : తన కుమారుడు డాక్టర్ వినయ్ (42) గుండెపోటుతో మరణించాడని తెలుసుకున్న అతని తండ్రి వీరభద్ర గుండగావి (70) కూడా గుండెపోటుతో మంగళవారం మరణించారు. హావేరి బసవేశ్వరనగరలో ఉంటున్న తండ్రీకుమారులు ఇద్దరూ వైద్యులే. తన కుమారుడు గుండెపోటుతో మరణించాడని తెలుసుకున్న కొద్ది సేపటికే వీరభద్ర మరణించారు.

వినోదానికి వెళితే.. వెంటాడిన మృత్యువు

విజయపుర, న్యూస్‌టుడే : స్థానిక నవభాగ రోడ్డు ఫిష్ టనెల్ ఎక్స్‌పోలో రేంజర్ స్వింగ్ బెల్టు తెగి నిఖిత (24) అనే యువతి కింద పడి మరణించింది. గత ఆదివారం తన స్నేహితురాళ్లతో కలిసి ఎక్స్‌పోకు వచ్చిన ఆమె రేంజర్ స్వింగ్ ఎక్కారు. బెల్టు తెగడంతో కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ ఆమె మంగళవారం మరణించారు.

బోల్తా కొట్టిన వాహనం

చామరాజనగర, న్యూస్‌టుడే : చామరాజనగర శివార్లలో మంగళవారం సాయంత్రం సంభవించిన రోడ్డుప్రమాదంలో 29 మంది మహిళా కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరు ప్రయాణిస్తున్న గూడ్సు ఆటో ఒక మలుపులో బోల్తా కొట్టడంతో ప్రమాదం సంభవించింది. బాధితులను చికిత్స కోసం చామరాజనగర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దర్శన్ ఆరోగ్యంపై ఆరా

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : హత్య కేసులో బళ్లారి కారాగారంలో విచారణ ఖైదీగా ఉన్న నటుడు దర్శన్ ఆరోగ్య వివరాలను అందించాలని జస్టిస్ విశ్వజిత్ శెట్టి ప్రభుత్వ న్యాయవాది ప్రసన్నకుమార్ సూచించారు. బెయిలు కోసం దర్శన్ వేసుకున్న అర్జీని న్యాయమూర్తి పరిశీలించారు. వెన్నునొప్పితో బాధపడుతున్న దర్శన్‌కు శస్త్రచికిత్స అవసరమని ఆయన తరపు న్యాయవాదులు ఇప్పటికే పేర్కొన్నారు. ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న చికిత్స వివరాలు తెలియజేయాలని ఆదేశించిన న్యాయమూర్తి తదుపరి విచారణను నవంబరు మొదటివారానికి వాయిదా వేశారు.

● చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో పరప్పన అగ్రహార కారాగారంలో నటుడు దర్శన్‌తో పాటు ప్రత్యేక సదుపాయాలు అందుకున్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏ3 పవన్ వేసుకున్న అర్జీని ఉన్నత న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. తనను మైసూరు కారాగారానికి పంపించాలంటూ దిగువ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని పవన్ అర్జీ వేసుకున్నారు. కేసు విచారణ పూర్తయిందని, అభియోగపత్రాన్ని కూడా పోలీసులు న్యాయస్థానంలో దాఖలా చేసిన నేపథ్యంలో పవన్‌ను పరప్పన అగ్రహార కారాగారంలోనే ఉంచాలని న్యాయమూర్తి ఆదేశించారు.

బీపీఎల్ కార్డుల రద్దు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : రాష్ట్రంలో 13.87 లక్షల బీపీఎల్ కార్డులను రద్దు చేస్తామని ఆహార శాఖ మంత్రి కేహెచ్ మునియప్ప తెలిపారు. వాటిలో 3.63 లక్షల కార్డులను ఇప్పటికే రద్దు చేశామని చెప్పారు. ఎక్కువ ఆదాయం, ప్రభుత్వ ఉద్యోగాలు, ఇతర వ్యాపారాలు ఉన్నప్పటికీ కొందరు బీపీఎల్ కార్డులను తీసుకున్నారని గుర్తించామని చెప్పారు. ఆదాయ పన్ను చెల్లిస్తున్న వారు స్వచ్ఛందంగా కార్డులను రద్దు చేసుకోవాలని కోరామని తెలిపారు. రద్దు చేసుకోకపోతే, తామే వాటి ఏరివేతకు చర్యలు తీసుకుంటామని వివరించారు.



పూల అలంకరణలో అమ్మవారు

బనశంకరికి ప్రత్యేక పూజలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : చాముండేశ్వరి ముడి ఉత్సవాల్లో భాగంగా బెంగళూరు బనశంకరి అమ్మవారిని వివిధ రంగుల పుష్పాలతో మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం వరకు మెట్రో రైలు సేవ ఉండడంతో భక్తులు పెద్ద సంఖ్యలో కదలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 4.30 వరకు భక్తులు రాహుకాల పూజలు చేసుకున్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్న సంతర్పణ చేశారు.

వైద్యులకు ప్రత్యేక కార్యశాల

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : హెర్నియా శస్త్రచికిత్సల విభాగంలో అత్యున్నత స్థాయి ప్రమాణాన్ని పాటిస్తున్న ఆసుపత్రిగా గుర్తింపు దక్కించుకున్న మారతహళ్లి కావేరి ఆసుపత్రిలో వైద్యుల కోసం ప్రత్యేక కార్యశాలను ఏర్పాటు చేశారు. ల్యాప్రోస్కోపిక్ విధానంలో హెర్నియా శస్త్రచికిత్సను నైపుణ్యంతో నిర్వహించే విధానాలను హెర్నియా సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ విజయ్ బోరగావ్కర్ నేతృత్వంలోని వైద్యులు రాజేశ్ ఖుల్లార్, గణేశ్ శెణై, విదేశీ వైద్యులు ఇమ్మానుయేల్ గెరెరో, కియోటక ఇమ్మమురా, సుజిత్ విజెరత్న బోధించారు. వైద్య విద్యార్థులు, వైద్య నిపుణుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులకు చక్కని స్పందన లభిస్తోందని ఆసుపత్రి యాజమాన్య ప్రతినిధి డాక్టర్ విజయభాస్కరన్ తెలిపారు.



అవగాహన వేదికపై ప్రముఖ వైద్యులు


స్వచ్ఛంద రక్తదాతలకు ఘనసత్కారం

రాయచూరు, న్యూస్‌టుడే: స్వచ్ఛందంగా రక్తదానం చేసిన దాతలను మంగళవారం సత్కరించారు. డీహెచ్‌ఓ కార్యాలయం సభా భవన్‌లో వైద్యాధికారులు దాతలు బసవరాజ రాంపూర్, కిరణ్, బాబు ఇనామదార, గాయత్రీ శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా డీహెచ్‌ఓ డాక్టర్ సురేంద్రబాబు మాట్లాడుతూ ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని దాతలను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. వీరిని ఇతరులు స్ఫూర్తిగా తీసుకుని రక్తం ఇచ్చేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. తరచూ రక్తం ఇవ్వడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని పరిశోధనల్లో నిరూపితమైందని చెప్పారు. దాతల సంఖ్య పెరిగితే రక్త కొరతను నివారించడం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్జన్ డాక్టర్ విజయకుమార్, వైద్యాధికారులు షాకీర్, యశోద, ప్రజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు

•బెంగళూరు •హోసూరు

26న చిత్రాంగద నృత్య నాటకం



అభినయించే కళాకారులు వీరే..

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే: నిగమ్ సుధా కళా సంఘం వార్షికోత్సవం సందర్భంగా రవీంద్రనాథ్ ఠాగూర్ స్వరపరిచిన చిత్రాంగద నృత్య నాటకాన్ని ప్రదర్శించనున్నారు. ఏడీఏ రంగ మందిరంలో 26న సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభం కానున్న వార్షిక ఉత్సవంలో కళాకారులు గురురాజు, మాధురి, గురు వైజయంతి కాశీకి సంబంధించిన ప్రత్యేక నృత్య రూపకాలతో పాటు చిత్రాంగద నృత్య నాటకం ఉంటుంది. భారతీయ ఇతిహాసం మహాభారతంలోని యోధ యువరాణి చిత్రాంగద కథ ఆధారంగా ఈ నృత్య నాటకాన్ని రూపొందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒడిస్సీ, భరతనాట్య భాష్యకారులు షర్మిలా ముఖర్జీ, సర్బానిఘోష్, ఏరోస్పేస్ శాస్త్రవేత్త డాక్టర్ ఉజ్జల్‌అధికారి తదితరులు హాజరవుతారని నిర్వాహకులు వెల్లడించారు.

హోసూరు కబుర్లు

రహదారిపై వర్షం నీరు తొలగింపు



అధికారులతో చర్చిస్తున్న సబ్-కలెక్టరు ప్రియాంక

హోసూరు, న్యూస్‌టుడే: హోసూరు ప్రాంతంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు హోసూరు-ఉద్దనపల్లి జాతీయ మార్గంలో అడ్డగుట్ట దగ్గర రహదారిపై వాన నీరు నిల్వ ఉండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న హోసూరు సబ్-కలెక్టరు ప్రియాంక అక్కడికి చేరుకొని నివారణ చర్యలు చేపట్టారు. కాలువలను ఆక్రమించడంతో సమస్య ఏర్పడినట్లు తేల్చారు. దీనిపై జాతీయ రహదారి ప్రాధికార సంస్థ అధికారులతో మాట్లాడి యంత్రాలతో నీటి నిల్వను తొలగించడంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి. ఆమెకు గ్రామస్థులు, వాహనచోదకులు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె వెంట బీడీఓ, రెవెన్యూ, జాతీయ రహదారుల అథారిటీ ఇంజినీర్లు ఉన్నారు.

ఆరు అసెంబ్లీ స్థానాల కైవసమే లక్ష్యం



వేదికపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే మునిస్వామి, చిత్రంలో ఏఐఏడీఎంకే నాయకులు

హోసూరు, న్యూస్‌టుడే: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో హోసూరు పరిధిలోని ఆరు అసెంబ్లీ స్థానాలను గెలవడానికి కృషి చేయాలని వేపనహళ్లి ఎమ్మెల్యే మునిస్వామి అన్నారు. శూలగిరిలోని ఓ కల్యాణ మంటపంలో మంగళవారం ఏఐఏడీఎంకే నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ డీఎంకే నేతృత్వంలోని ప్రభుత్వ పనితీరు ప్రజలకు వ్యతిరేకంగా ఉందని, దీన్ని అవకాశంగా తీసుకొని రానున్న ఎన్నికల్లో అధిక స్థానాలు కైవసం చేసుకోవడానికి పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి పార్టీ జిల్లా ప్రాజెక్టు కమిటీ సభ్యుడు సీకనపల్లి బాబు వెంకటాచలం అధ్యక్షత వహించారు. మాజీ ఎంపీ అశోక్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మునివెంకటప్ప, హోసూరు యూనియన్ మాజీ ఛైర్‌పర్సన్ పుష్ప సర్వేష్, నాయకుడు బేరికె చిన్నఅబ్బయ్య, అత్తిమొగం పంచాయతీ అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రాజకాలువలో పూడికతీత



కమిషనరు శ్రీకాంత్‌తో మాట్లాడుతున్న కార్పొరేటరు ఇంద్రాణి

హోసూరు, న్యూస్‌టుడే: హోసూరు నగర పాలికె పరిధి 33వ వార్డులోని శాంతినగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్పొరేటరు ఇంద్రాణి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చేపట్టారు. వార్డులోని రామనాయక చెరువుకు సంబంధించిన ప్రధాన రాజకాలువలో పేరుకున్న పూడికను తీయించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రాజకాలువ పొంగి మురుగునీరు రహదారిపై ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది తలెత్తింది. విషయాన్ని ఇంద్రాణి కమిషనరు శ్రీకాంత్‌కు తెలిపారు. స్పందించిన ఆయన అక్కడికి చేరుకొని స్థానికులతో మాట్లాడారు. జేసీబీని తెప్పించి పూడికతీత చేపట్టారు. వార్డులో పూర్తయిన పలు పనులను పరిశీలించారు. అనంతరం ఉత్తమ సేవలందించిన కార్పొరేటరు ఇంద్రాణిని స్థానికులు ఘనంగా సత్కరించారు.

చెత్తాచెదారం తొలగింపు



హోసూరు కార్పొరేషన్ పరిధి తళి మార్గంలో 37వ వార్డు జవహర నగరులో రోడ్డుకిరువైపులా పేరుకుపోయిన చెత్తకుప్పలు తొలగించి మురుగు కాలువను శుభ్రం చేశారు. కార్పొరేటరు, పన్నుల విభాగం ఛైర్మను చెన్నీరప్ప స్వయంగా పాల్గొని శ్రమదానం చేశారు. టీవీఎస్ నగరు, మిడిగిరిపల్లి తదితర ప్రాంతాల్లోని మురుగుకాలువలను శుభ్రం చేయించారు. స్థానికులు చెన్నీరప్పను అభినందించారు.

- న్యూస్‌టుడే, హోసూరు

వానంటేనే గుండెల్లో దడదడ

- జనజీవనం అస్తవ్యస్తం
- శివారు కాలనీలు జలమయం



చిక్కబాణావర వద్ద పొక్లెయినుతో నీటి ప్రవాహానికి అడ్డు తొలగింపు

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే: రాష్ట్ర రాజధాని బెంగళూరు నగరాన్ని వారం రోజులుగా వరుణుడు వీడటం లేదు. వానను చూస్తేనే నగరవాసుల గుండెలు దడదడ కొట్టుకుంటున్నాయంటే అతిశయోక్తి కాదు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు ఉరుములు, మెరుపులు, పిడుగులతో కురిసిన భారీ వర్షానికి నగరంతో పాటు మురుగువాడలు, శివారు ప్రాంతాలు మునిగిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళనతో జీవిస్తున్నారు. ప్రధాన రహదారులన్నీ రాజకాలువలను తలపిస్తున్నాయి. వీధులన్నీ వాగుల్లా మారాయి. ఇళ్లలోకి చేరిన నీటిని బయటకు పంపడానికి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. జాలహళ్లి, దొడ్డబొమ్మసంద్ర, బ్యాటరాయనపుర, తింద్లు లోతట్టు కాలనీలు, శారదాంబ నగర్, ఆర్‌కే పుర, ఖాతానగర్, సిద్ధార్థ నగర, కేజీ హళ్లి, సోమదేవనహళ్లి, మత్తికెరె తదితర ప్రాంతాల్లో ఇళ్లు, వీధులు, రహదారులన్నీ మునిగిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో కార్లు, ద్విచక్రవాహనాలు పూర్తిగా నీట మునిగి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. లోతట్టు ప్రాంతాలు, మురుగువాడలోని ప్రజలు పలు పాఠశాలల్లో ఆశ్రయం పొందారు. అపార్టుమెంట్లలో నివసిస్తున్న కుటుంబాలు వానకు భయపడి బయటకు రావడం లేదు. కొన్ని ప్రాంతాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో చీకటిలో బిక్కుబిక్కుమంటున్నారు.



వాగులా మారిన శారదాంబ కాలనీ



దొడ్డబొమ్మసంద్రలో వాన నీటిలో మునిగిన కార్లు



డీసీసంద్రలో రాజన్న ఇంటి గేటు వరకు వచ్చిన నీరు

వినతులు స్వీకరించిన మంత్రి

ధార్వాడ, న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ ఆడిటోరియంలో సోమవారం 7వ జిల్లా స్థాయి జనతాదర్శన్‌ను మంత్రి సంతోష్‌లాడ్ నిర్వహించారు. వివిధ సంస్థలు, స్థానికుల నుంచి వినతులు స్వీకరించారు. వినతులు ఇచ్చేందుకు వేదిక వద్దకు దివ్యాంగులు రావద్దని సూచించి, వారి వద్దకు ఆయనే స్వయంగా వెళ్లి కింద కూర్చుని మనవి పత్రాలు తీసుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 213 వినతులు స్వీకరించారని, వాటిని పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపించామని అధికారులు తెలిపారు.

'కుల గణన నివేదికను అంగీకరించం'

బెంగళూరు (మల్లేశ్వరం): పదేళ్ల క్రితం నిర్వహించిన కుల గణన సమీక్ష నివేదికను ఇప్పుడు జారీ చేసేందుకు అంగీకరించమని అఖిల భారత వీరశైవ మహాసభ స్పష్టం చేసింది. మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప, మహాసభ అధ్యక్షుడు డాక్టర్ శామనూరు శివశంకరతో పాటు అన్ని పార్టీల తాజా, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు సమావేశంలో పాల్గొన్నారు. హెచ్. కాంతరాజు ఇచ్చిన నివేదికలోని అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆ నివేదికను ఇప్పుడు జారీ చేయవలసిన అవసరం లేదని తీర్మానించారు.

ఎగువ భద్ర పథకానికి నిధులివ్వరా



రోడ్డపై బైఠాయించిన కరవే కార్యకర్తలు

చిత్రదుర్గం, న్యూస్‌టుడే: ఎగువ భద్ర పథకానికి ప్రభుత్వం నిధులు కేటాయించి త్వరతగతిన పూర్తి చేయాలని కర్ణాటక రక్షణ వేదిక నాయకులు డిమాండు చేశారు. జిల్లాధికారి కార్యాలయం వద్ద మంగళవారం కరవే కార్యకర్తలు ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. చిత్రదుర్గం, దావణగెరె, చిక్కమగళూరు, తుమకూరు జిల్లాల్లోని వేలాది మంది రైతులకు సాగునీరు అందించే ఈ పథకానికి కొన్ని సంవత్సరాలుగా నిధులను సమకూర్చకపోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా నిధులను విడుదల చేసి పనులు ప్రారంభించాలని కోరారు. ధర్నాలో కరవే జిల్లాధ్యక్షుడు రవికుమార్ నాయ్క, నాయకులు అరుణ్‌కుమార్, అశోక్, స్వామి, ఆశా, రేణుకా తదితరులు పాల్గొన్నారు.

హస్తకళా వస్తు ప్రదర్శన ప్రారంభం



ఆకట్టుకుంటున్న పత్తి దుస్తులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సాయంతో నడిచే చేనేత మగ్గాల సంఘాలు, స్త్రీ సహాయ బృందాలు, హస్త కళాకారులు రూపొందించిన సామగ్రి, వస్త్రాలతో కూడిన మెగా ప్రదర్శన దీపావళిని పురస్కరించుకొని మంగళవారం నగరంలోని హులిమావు, బన్నేరుఘట్ట రోడ్డు దేవకి ఆనంద సువర్ణ కన్వెన్షన్ హాల్‌లో ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ చేనేత వస్త్రాలు, కర్ణాటక మైసూరు పట్టు చీరలు, ఒడిశా హస్తకళా పట్టు, పత్తి దుస్తులు, బెంగాలి కాటన్ చీరలు, రాజస్థాన్ హస్తకళా సామగ్రి, శరన్‌పూర్ కొయ్య వస్తువులు, మార్బుల్ కళాఖండాలు, బంగారు పూత ఆభరణాలు, బంధాని, బందేజ్ వివిధ రంగుల వస్త్రాలను ప్రదర్శనలో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ చేనేత వస్త్రాలు, ఢాకాయ్ మస్లిన్ జమ్దానీ చీరలు, దేశంలోని తూర్పు విభాగంలో ఆదివాసీలు తయారుచేసే వస్త్రాలు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. ఈ నెల 30 వరకు ప్రదర్శన ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందని వివరించారు.

అథ్లెటిక్స్‌లో కర్ణాటకకు రెండో స్థానం



క్రీడాకారులు ఆయుస్‌ప్రాంజల్, దయానంద, శృతిశెట్టి వ్యక్తిగత ప్రశస్తులు అందుకున్నారు.

-న్యూస్‌టుడే, బెంగళూరు (క్రీడలు)

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో జరిగిన 35వ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలో కర్ణాటక రెండో స్థానాన్ని దక్కించుకుంది. బాలుర విభాగంలో 115, బాలికల గ్రూపులో 138 పాయింట్లు సాధించినట్లు కర్ణాటక అథ్లెటిక్స్ సంఘం తెలిపింది. వేర్వేరు వయో విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో 16 ఏళ్ల బాలుర విభాగంలో ద్వితీయ, 18 ఏళ్ల బాలికల విభాగంలో అగ్రస్థానం పొందినట్లు వెల్లడించింది.

స్వదేశీ బ్రాండ్లకు గుర్తింపే లక్ష్యం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: స్వదేశీ డెనిమ్ బ్రాండ్ ఫ్లయింగ్ మెషిన్‌కు మంచి గిరాకీ ఉందని అరవింద్ ఫ్యాషన్స్ సీఈఓ శైలేశ్ చతుర్వేది అన్నారు. ఫీనిక్స్ మాల్‌లో ఫ్యాషన్ ఐకాన్ ఒర్రీతో కలిసి యువ వినియోగదారులతో మాట్లాడారు. యువత కోరుకునే వస్త్రాలు, డిజైన్లు, ఇతర అనుబంధ వస్తువులను రూపొందించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. దేశీయ బ్రాండ్లకు తగిన గుర్తింపు తేవడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా మెట్రో నగరాలు, పట్టణాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



శిక్షకుడు రవిపాల్‌తో విజేత జట్టు ఆటగాళ్లు

రామప్రసాద్ షీల్డ్ విజేత వైదేహి స్కూల్

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: కర్ణాటక క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో కె.ఎం. రామప్రసాద్ షీల్డ్ అండర్-16 క్రికెట్ పోటీలో వైదేహి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం ఐటీఐ మైదానంలో జరిగిన ఫైనల్స్‌లో మొదట బ్యాటింగ్ చేసిన వైదేహి జట్టు నిర్ణీత 30 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. 221 పరుగుల విజయ లక్ష్యంతో ఛేదనకు దిగిన విద్యానికేతన్ జట్టు 27.2 ఓవర్లలో 120 పరుగులకు ఆలౌటై పరాజయం పాలైంది. విజేత జట్టులో ఆల్‌రౌండర్ తరుణ్ బాలమురుగన్ 74 పరుగులు చేసి, బౌలింగ్‌లో నాలుగు వికెట్లు తీశాడు. ముగింపు కార్యక్రమంలో జట్టు ప్రధాన శిక్షకుడు రవిపాల్ విజేత జట్టు సభ్యులను అభినందించారు.

తుకారామ్‌ను అనర్హునిగా ప్రకటించాలి

బెంగళూరు (గ్రామీణం): బళ్లారి ఎంపీ ఇ.తుకారామ్‌ను అనర్హుడిగా ప్రకటించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కోరినట్లు భాజపా అధ్యక్షుడు బీవై విజయేంద్ర తెలిపారు. ఎన్నికల్లో నగదు పంచి గెలిచినట్లు వాల్మీకి కార్పొరేషన్ అక్రమాల్లో పట్టుబడిన నిందితులను విచారించగా తేటతెల్లమైనట్లు ఆయన గుర్తుచేశారు. ఎన్నికల కమిషనర్, ఇతర అధికారులకు అన్ని ఆధారాలు, దాఖలాలు అందించామని ఆయన వెల్లడించారు.

దక్షిణ భాగంలోనే విమానాశ్రయానికి వినతి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: బెంగళూరుకు అవసరమైన రెండో విమానాశ్రయాన్ని బెంగళూరు దక్షిణ భాగంలోనే నిర్మించాలని మండ్య, రామనగర, మైసూరు ప్రాంతాలకు చెందిన చట్టసభ ప్రతినిధులు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌ను కోరారు. తుమకూరు బదులుగా రామనగర, మండ్య జిల్లాలకు సమీపంగా విమానాశ్రయం నిర్మిస్తే ఎక్కువమందికి ఉపయోగపడుతుందని లేఖ రాశారు. తుమకూరులో ఇప్పటికే ప్రకటించిన పారిశ్రామికవాడ, ఆహార సంస్కరణల కేంద్రం, హెలికాప్టర్ల తయారీ విభాగాలు ఉన్నాయన్నారు.

విద్యార్థుల వెతలు పట్టవా..!



మురుగు నీటిలో వెళుతున్న విద్యార్థులు

దర్పణం

పావగడ, న్యూస్‌టుడే: విద్యార్థులు మురుగు నీటిని తొక్కుకుంటూ తరగతి గదులకు వెళ్లాల్సిన దుస్థితి పావగడ తాలూకాలోని వై.ఎన్.హొసకోట గ్రామంలోని ఉన్నత పాఠశాలలో నెలకొంది. వై.ఎన్.హొసకోట, దొడ్డహళ్లి గ్రామాల మధ్యలో గ్రామ పంచాయతీ ఇచ్చిన సర్వే నంబరు 249లోని రెండు ఎకరాల్లో ఈ ఉన్నత పాఠశాల నిర్మించారు. ఇక్కడ 8, 9, 10 తరగతుల్లో 160 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇదిలా ఉండగా బడి నిర్మించిన స్థలం తమదంటూ సమీప కోటేశ్వర దేవాలయ కమిటీ సభ్యులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పాఠశాలకు దారి లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో గ్రామంలోని వర్షపు నీటితో కలిసిన మురుగు కాలువ నీరంతా పాఠశాల ఆవరణలోకి చేరుతోంది. పాపం విద్యార్థులు మురుగు నీటిని తొక్కుకుంటూ తరగతి గదులకు వెళ్లాల్సి వస్తోందని పోషకులైన గ్రామ పంచాయతీ సభ్యులు ఎల్.కె.రాఘవేంద్ర, శివప్రసాదు, గ్రామ పంచాయతీ మాజీ సభ్యుడు వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రధానోపాధ్యాయుడు హనుమంతరాయ విన్నవించారు.

ఎన్నికలంటే దళ్‌కు భయం లేదు



జ్యోతి వెలిగిస్తున్న దేవేగౌడ, కుమారస్వామి, నిఖిల్

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: ఎన్నికల్లో పోటీ చేసేందుకు దళ్ ఎప్పుడూ భయపడదని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి స్పష్టం చేశారు. ఆయన పార్టీ ప్రధాన కార్యాలయం జేపీ భవన్‌లో తండ్రి దేవేగౌడ, కుమారుడు నిఖిల్‌తో కలిసి చెన్నపట్టణ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులతో సమావేశమై మాట్లాడారు. అభ్యర్థిని ప్రకటించేందుకు ఇంకా మూడు రోజుల సమయం ఉందన్నారు. దళ్ నుంచి అభ్యర్థిని నిలపాలని భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా తనకు ఫోన్ చేసి తెలిపారని చెప్పారు. ప్రధాని మోదీ కూడా దేవేగౌడకు తగిన గౌరవం ఇస్తారని గుర్తుచేశారు. కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునే అభ్యర్థిని బరిలో దించుతామన్నారు. తాను రెండుసార్లు ఓడిపోయినా, తిరిగి ఎన్నికల్లో పోటీ చేసేందుకు భయపడనని, పార్టీ ఆదేశిస్తే పోటీకి సిద్ధమని నిఖిల్ కుమారస్వామి ఈ సందర్భంగా ప్రకటించారు.

అరెస్టు పేరిట హడలెత్తించి..

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : 'అక్రమంగా ప్రకటనలు, అశ్లీల వీడియోలు, ప్రజలను హింసించే సందేశాలను పంపిస్తున్నారు. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తాం' అంటూ వచ్చిన ఫోన్‌కాల్‌తో ఎస్.గణపతి అనే వ్యక్తి భయపడిపోయారు. ధార్వాడకు చెందిన ఆయన ఒక బ్యాంకు నుంచి ఇటీవలే పదవీ విరమణ పొందారు. 'మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తే.. ఇంటి నుంచి బయటకు వెళ్లలేరు. ఫోన్‌లో ఎవరితోనైనా మాట్లాడితే అరెస్టు చేసి, కారాగారంలో వేస్తా' మని బెదిరించారు. కొంత నగదు ఇస్తే, కేసులేకుండా చేస్తామని ఆయనను నమ్మించి రూ.95.50 లక్షల నగదును ఖాతాల్లోకి బదిలీ చేయించుకున్నారు. మోసపోయానని ఆలస్యంగా గుర్తించిన ఆయన హుబ్బళ్లి-ధార్వాడ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

పెట్టుబడి పేరిట వంచన

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : షేరు మార్కెట్‌లో పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఇస్తామని నమ్మించి కొందరు తనను రూ.11.24 లక్షలకు వంచించారని ఎస్.మంజునాథ్ అనే వ్యక్తి హుబ్బళ్లి సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. పెన్నిస్టాక్ పేరిట మొదట తాను పెట్టిన మదుపుపై నిందితులు 20 శాతం లాభాన్ని ఇచ్చారు. ఈసారి 200 శాతం లాభం ఇస్తామని రూ.11.24 లక్షలు బదిలీ చేయించుకుని మోసం చేశారని బాధితుడు తెలిపాడు. అనయ స్మిత్, గీతికా ఆనంద, మోతీలాల్ ఓస్వాల్ అనే వ్యక్తులపై మంజునాథ్ ఫిర్యాదు చేశారు.

క్రీడా వసతులను వినియోగించుకోవాలి



ప్రశస్తి అందుకున్న ఆళ్వాస్ క్రీడాకారుల బృందం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: ఒకప్పుడు క్రీడా సౌకర్యాల కొరత ఉండేది. నేడు అన్ని వసతులు లభిస్తున్నందున వాటిని సద్వినియోగం చేసుకొని చక్కటి సాధనతో విజయాలు పొందాలని మాజీ మంత్రి అభయచంద్రజైన్ తెలిపారు. మూడబిదిరే విద్యాగిరిలో పాఠశాల విద్యా శాఖ, ఆళ్వాస్ పీయూ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయి పీయూ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలను మాజీ మంత్రితో కలిసి విద్యాశాఖ ఉప డైరెక్టర్ సి.డి.జయణ్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా జయణ్ణ మాట్లాడుతూ దక్షిణ కన్నడ జిల్లా క్రీడా పోటీల నిర్వహణలో పేరుగాంచిందన్నారు. ఆటలో గెలుపోటములు సహజమని, ఆటగాళ్లు క్రీడా స్ఫూర్తి చాటాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, కఠోర శ్రమతోనే విజయాలు దక్కుతాయని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. అనంతరం జరిగిన పోటీల్లో పదునెనిమిదోసారి మూడబిదిరే తాలూకా ఆళ్వాస్ పీయూ కళాశాల బాలబాలికల విభాగాల్లో ఓవరాల్ ప్రశస్తి అందుకొంది. ఆళ్వాస్‌కు చెందిన దయానంద, ముల్కీ తాలూకా నుంచి రంగణ్ణ ఉత్తమ అథ్లెట్లుగా వ్యక్తిగత ప్రశస్తులు పొందారు. కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య మహమ్మద్ సదాకత్, జిల్లా పీయూ కళాశాల దైహిక శిక్షణ ఉపన్యాస సంఘం అధ్యక్షుడు ప్రేమనాథ శెట్టి, గౌరవాధ్యక్షుడు సుధాకరశెట్టి, సంచాలకుడు శశిధరమాణి తదితరులు పోటీలను పర్యవేక్షించారు.

క్రమశిక్షణకు క్రీడలు దోహదం



వంద మీటర్ల పరుగులో బాలికలు

చిత్రదుర్గం, న్యూస్‌టుడే: ఆటలు ఆడటం వల్ల క్రమశిక్షణతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని చిత్రదుర్గం నగరాభివృద్ధి సంస్థ (కుడా) అధ్యక్షుడు ఎంకె తాజ్‌పీర్ అన్నారు. ఇక్కడి ఒనకే ఓబవ్వ క్రీడా మైదానంలో ఆయన మంగళవారం14, 17 ఏళ్ల విభాగంలో పాఠశాలల జిల్లా స్థాయి క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. రోజూ ఏదో ఒక ఆట ఆడితే ఉత్సాహంగా పని చేయవచ్చన్నారు. సుమారు 200 మంది విద్యార్థులు వివిధ క్రీడల్లో పోటీపడ్డారు. కార్యక్రమంలో డీఈవో మంజునాథ్, జిల్లా వ్యాయామ శిక్షణాధికారి చిదానందస్వామి, తాలూకా విద్యాశాఖ అధికారి నాగభూషణ్, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు నాగేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తమ్ముడిని హత్య చేసిన అన్న అరెస్టు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: తమ్ముడు ఆనంద్(27)ను కర్రతో కొట్టి హత్య చేసిన అన్న మణికంఠను సర్జాపుర పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నదమ్ములు ఇద్దరూ భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తున్నారు. తమిళనాడులో ఉంటున్న మణికంఠ సోమవారం సాయంత్రం తమ్ముడి వద్ద ఉంటున్న తల్లిదండ్రులను చూసేందుకు పండితన అగ్రహారకు వచ్చాడు. ఆ సమయంలో మద్యం తాగిన తమ్ముడు మత్తులో అన్నతో గొడవపడ్డాడు. కోపం పట్టలేక అన్న తమ్ముడిని కర్రతో కొట్టడంతో మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

12 మంది యువతులకు రక్షణ

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: ఉపాధి పేరుతో వివిధ రాష్ట్రాల నుంచి 12 మంది యువతులను నగరానికి తీసుకొచ్చి వారి చేత బలవంతంగా పడుపు వృత్తి చేయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో సీసీబీ పోలీసులు వ్యభిచార కేంద్రంపై దాడి చేసి ఆ 12 మంది యువతులను రక్షించారు. వారిని మహిళా సహాయ కేంద్రానికి తరలించారు. వారిని తీసుకొచ్చిన ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిర్వాహకులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

రూ.22.86 లక్షల విలువైన బంగారం స్వాధీనం

బెంగళూరు (యశ్వంతపుర): తాళాలు వేసిన ఇళ్లను గుర్తించి రాత్రుల్లో చోరీలకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై నిందితులు అభినేజర్, జోసెఫ్, గుణ, నవీన్‌కుమార్, మంజునాథ్‌ను బేగూరు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.22.86 లక్షల విలువచేసే 308 గ్రాముల బంగారు నగలు, మూడు చరవాణులను స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీసు కమిషనర్ దయానంద్ మంగళవారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. అనంతరం ఆయన స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలించారు. నిందితులు బేగూరు, హుళిమావు, హెచ్ఎస్ఆర్ లేఅవుట్ తదితర ప్రాంతాల్లోని ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు.

పోలీసుల అదుపులో ముగ్గురు విదేశీయులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నగరంలోని వివిధ ప్రాంతాల్లో మాదకద్రవ్యాలను విక్రయిస్తున్నారనే ఆరోపణలపై ఆఫ్రికా దేశానికి చెందిన ఇమానుయల్ కోఫీ(37), ఫూడిజోసెఫ్(38), హన్నిఅనై(31)లను సీసీబీ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 82 గ్రాముల ఎండీఎంఏ, క్రిస్టల్స్, మూడు చరవాణులను స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీసు కమిషనర్ దయానంద్ తెలిపారు. కాడుగూడిలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకున్న విదేశీయులు మాదకద్రవ్యాలను వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తెలియజేశారు. ముగ్గురూ మెడికల్ వీసాపై దిల్లీకి వచ్చి, అనంతరం బెంగళూరులో అక్రమంగా నివసిస్తున్నట్లు వెల్లడించారు. గతంలో రెండుసార్లు అరెస్టయిన నిందితులు జామీనుపై బయటకు వచ్చి తిరిగి పాత వృత్తి చేపట్టారని ఆయన వివరించారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: స్నేహితుడి ఇంట్లో దొంగతనానికి పాల్పడిన నిందితుడు ముళబాగిలు నివాసి చిరంజీవిని పుట్టేనహళ్లి పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.6 లక్షల విలువచేసే 95 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. దొరెసానిపాళ్యలో నివసిస్తున్న బాల్య స్నేహితుడు ఇంట్లో నిందితుడు దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాల చోరీ ఆరోపణలపై నిందితులు సయ్యద్, హుస్సేన్‌లను పుట్టేనహళ్లి పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.51 లక్షలు విలువ చేసే ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

బళ్ళారి
•బళ్ళారి •రాయచూరు



స్వాధీనం చేసుకున్న సొత్తు ప్రదర్శించిన సింధనూరు పోలీసులు

తుర్విహాళలో దొంగతనం.. దేవదుర్గలో స్వాధీనం

సింధనూరు,: సింధనూరు తాలూకా తుర్విహాళ పోలీసులు చాకచక్యంగా దొంగను పట్టుకుని రూ.1.35 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం సింధనూరు డీఎస్పీ తళవార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ నెల 18న అర్ధరాత్రి తుర్విహాళలో కుష్టిగి ప్రధాన రహదారిని అనుకుని ఉన్న మహబూబ్‌సాబ్ అనే వ్యక్తి ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో విలువైన బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. ఈ మేరకు ఆయన తుర్విహాళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి నిఘా వహించిన తుర్విహాళ పోలీసులు. .పలు ఆధారాలతో కాపుగాచారు. పక్కా ప్రణాళికతో దేవదుర్గ తాలూకా గలగ గ్రామం వద్ద నిందితుడు నాగరాజ్‌ను పట్టుకున్నారు. అతని నుంచి మొత్తం ఆభరణాలు, ద్విచక్ర వాహనాన్ని వశపర్చుకుని అదుపులోకి తీసుకున్నారు. దొంగతనం జరిగి అయిదు రోజుల్లో కేసును ఛేదించిన తుర్విహాళ పోలీసులను సింధనూరు డీఎస్పీ తళవార్ అభినందించారు.

బంగారం చోరీ: నిందితుడి అరెస్టు

రాయచూరు: బంగారు దుకాణంలో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు బంధించారు. ఎస్పీ పుట్టమాదయ్య తెలిపిన వివరాల ప్రకారం. . రాయచూరు పట్టణంలోని మలబార్ బంగారు దుకాణానికి 18 రాత్రి 7.40 గంటలకు ఒక వ్యక్తి వచ్చారు. సిబ్బంది మహబూబ్ బాబా వద్దకు వెళ్లి ఆభరణాలు చూపించాలని కోరారు. ఆయన వివిధ ఆభరణాలు చూపిస్తుండగా కొనుగోలుకు వచ్చిన వ్యక్తి రూ.2.91 లక్షలు విలువచేసే 40. 149 గ్రాముల బంగారు గొలుసును తస్కరించి చెప్పుల్లో పెట్టుకుని వెళ్లిపోయారు. చోరీ జరిగినట్లు గుర్తించిన సిబ్బంది 20న పశ్చిమ ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్పీ కేసు దర్యాప్తునకు ఎస్సైలు మంజనాథ్, లక్ష్మీదేవి, కానిస్టేబుళ్లు నాగప్ప, గౌస్ పాషా, రవిరాజ, ఎం.ఆర్.మంజునాథ్‌తో బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం సాంకేతిక పరిజ్ఞానంతో బానూత్ భాస్కర్ అనే అనుమానితుడిని అరెస్టు చేసింది. విచారణలో నిందితుడు చోరీ చేసినట్లు అంగీకరించాడు. అతడి నుంచి బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్న పోలీసులు మంగళవారం న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టారు. నిందితుడు తెలంగాణలోని నల్గొండ జిల్లా తురకపల్లి మండలం నాగాయపల్లి నివాసిగా గుర్తించారు. కేసు ఛేదించిన బృందాన్ని ఎస్పీ పుట్టమాదయ్య అభినందించారు.

అప్పు చెల్లించలేదని హత్య

ఉడుపి: తన వద్ద తీసుకున్న తీసుకున్న నగదు తిరిగి ఇవ్వలేదని ప్రశాంత్ శెట్టి (32) అనే వ్యక్తిని స్నేహితుడు ఈరణ్ణ (30) కత్తితో గొంతుకోసి మంగళవారం ఉదయం హత్య చేశాడు. హంతకుడు విజయనగర జిల్లా హూవినహడగలి నివాసి. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఒక భవంతి దిగువ అంతస్తులో కత్తితో దాడి చేసి హత్య చేశాడు. నిందితుడ్ని అరెస్టు చేసి, విచారణ చేస్తున్నామని ఎస్పీ కె.అరుణ్ తెలిపారు.

పెట్టుబడి పేరిట వంచన

హుబ్బళ్లి, న్యూస్‌టుడే: షేరు మార్కెట్‌లో పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఇస్తామని నమ్మించి కొందరు తనను రూ.11.24 లక్షలకు వంచించారని ఎస్.మంజునాథ్ అనే వ్యక్తి హుబ్బళ్లి సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. పెన్ని స్టాక్ పేరిట మొదట తాను పెట్టిన మదుపుపై నిందితులు 20 శాతం లాభాన్ని ఇచ్చారు. ఈసారి 200 శాతం లాభం ఇస్తామని రూ. 11.24 లక్షలు బదిలీ చేయించుకుని మోసం చేశారని బాధితుడు తెలిపాడు. అనయ స్మిత్, గీతికా ఆనంద, మోతీలాల్ ఓస్వాల్ అనే వ్యక్తులపై మంజునాథ్ ఫిర్యాదు చేశారు.

దర్శన్ ఆరోగ్యంపై ఆరా

బెంగళూరు (శివాజీనగర),: హత్య కేసులో బళ్లారి కారాగారంలో విచారణ ఖైదీగా ఉన్న నటుడు దర్శన్ ఆరోగ్య వివరాలను అందించాలని జస్టిస్ విశ్వజిత్ శెట్టి ప్రభుత్వ న్యాయవాది ప్రసన్నకుమార్ సూచించారు. బెయిలు కోసం దర్శన్ వేసుకున్న అర్జీని న్యాయమూర్తి పరిశీలించారు. వెన్నునొప్పితో బాధపడుతున్న దర్శన్‌కు శస్త్రచికిత్స అవసరమని ఆయన తరఫు న్యాయవాదులు ఇప్పటికే పేర్కొన్నారు. ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న చికిత్స వివరాలు తెలియజేయాలని ఆదేశించిన న్యాయమూర్తి తదుపరి విచారణను నవంబరు మొదటివారానికి వాయిదా వేశారు.

- చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో పరప్పన అగ్రహార కారాగారంలో నటుడు దర్శన్‌తో పాటు ప్రత్యేక సదుపాయాలు అందుకున్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏ3 పవన్ వేసుకున్న అర్జీని ఉన్నత న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. తనను మైసూరు కారాగారానికి పంపించాలంటూ దిగువ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని పవన్ అర్జీ వేసుకున్నారు. కేసు విచారణ పూర్తయిందని, అభియోగపత్రాన్ని కూడా పోలీసులు న్యాయస్థానంలో దాఖలా చేసిన నేపథ్యంలో పవన్‌ను పరప్పన అగ్రహార కారాగారంలోనే ఉంచాలని న్యాయమూర్తి ఆదేశించారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

22-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.92	1611.35
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	51,001	000
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	51,309	9,900
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.461	40.303

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

బీపీఎల్ కార్డుల రద్దు

బెంగళూరు (సదాశివనగర): రాష్ట్రంలో 13.87 లక్షల బీపీఎల్ కార్డులను రద్దు చేస్తామని ఆహార శాఖ మంత్రి కేహెచ్ మునియప్ప తెలిపారు. వాటిలో 3.63 లక్షల కార్డులను ఇప్పటికే రద్దు చేశామని చెప్పారు. ఎక్కువ ఆదాయం, ప్రభుత్వ ఉద్యోగాలు, ఇతర వ్యాపారాలు ఉన్నప్పటికీ కొందరు బీపీఎల్ కార్డులను తీసుకున్నారని గుర్తించామని చెప్పారు. ఆదాయ పన్ను చెల్లిస్తున్న వారు స్వచ్ఛందంగా కార్డులను రద్దు చేసుకోవాలని కోరామని తెలిపారు.

ప్రమాదవశాత్తు అన్నా, చెల్లి చెరువుపాలు

యశ్వంతపుర, కెంగేరి: నీరు తెచ్చేందుకు కెంగేరి చెరువులో దిగిన చెల్లెలు మహాలక్ష్మీ(11) మునిగిపోతోందని గుర్తించిన సోదరుడు శ్రీనివాస్ అలియాస్ జాన్సీ(13) నీటిలోదిగి ఇక్కట్లలో చిక్కారు. ఆ ఇద్దరూ చెరువులో మునిగి మృతి చెందిన సంఘటన కెంగేరి పోలీసుఠాణా పరిధిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. మృతుల్లో ఒక్కరైన శ్రీనివాస్ మృతదేహాన్ని మంగళవారం ఉదయం అగ్నిమాపక సిబ్బంది వెలికితీశారు. మహాలక్ష్మీ మృతదేహం కోసం గాలిస్తున్నారు. నీటిలో కనిపించే కెమెరాల సాయంతో మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వీరిద్దరూ పారిశుద్ధ్య కార్మికురాలు జయమ్మ కుటుంబీకులుగా గుర్తించారు. విషయం తెలిసిన వెంటనే సోమవారం సాయంత్రం ఆరుగంటల నుంచి అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. వర్షం కురుస్తుండటం, చీకటిపడటంతో గాలింపు చర్యలు నిలిపి ఉదయం నుంచి కొనసాగిస్తున్నారు.

ప్రజల అండే శ్రీరామరక్ష



శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల వేదికపై మంత్రులు, ప్రముఖులతో సిద్ధరామయ్య

మైసూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రజల అండ ఉన్నంత వరకు తాను భాజపా, దళ్ కుట్రలకు భయపడనని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. వారి అసత్య ఆరోపణలతో సామాజిక న్యాయం చేయకుండా వెనక్కు తగ్గనని స్పష్టం చేశారు. వరుణ నియోజకవర్గంలో రూ.501.81 కోట్ల ఖర్చుతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు మంత్రులతో కలిసి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయా పథకాల లబ్ధిదారులకు వ్యవసాయ యంత్ర పరికరాలు, వాహనాలను పంపిణీ చేశారు. స్థానికుల నుంచి ఆయన సత్కారాన్ని అందుకుని మాట్లాడారు. వరుణ ఓటర్ల ఆశీస్సులతో రెండుసార్లు ముఖ్యమంత్రిని అయ్యానని చెప్పారు. ఈ నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోటని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా తాను ఆయా పథకాలను చేపట్టేందుకు నిధులు కేటాయించి, పనులకు శంకుస్థాపన చేశానని చెప్పారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పేదలకు ఆర్థికశక్తిని అందించేందుకు గ్యారంటీలను అమలు చేస్తున్నానని తెలిపారు. గ్యారంటీ పథకాల జారీకి బడ్జెట్‌లో రూ.56 వేల కోట్లను కేటాయించానని తెలిపారు.

పేదలంటే వారికి మంట

కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి, కర్ణాటకలో మాజీ ముఖ్యమంత్రులు యడియూరప్ప, బొమ్మై, కుమారస్వామికి పేదలంటే కంటగింపని సిద్ధరామయ్య దుయ్యబట్టారు. మూడుసార్లు ప్రధాని అయిన నరేంద్రమోదీ, తాను ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రతిసారీ విఫలమవుతున్నారని తప్పుబట్టారు. శ్రీమంతులు, వ్యాపారులకు, ఉత్తరాది వారికి మాత్రమే ప్రధాని అన్నట్లు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. కర్ణాటక ఎక్కువ మొత్తంలో పన్ను చెల్లిస్తున్నా వాటా మాత్రం నామమాత్రంగా ఉందన్నారు. పన్ను వాటాను భిక్షంలా అడుక్కోవాలని కేంద్రం భావిస్తున్నట్లు ఉందన్నారు. కర్ణాటక నీటి పారుదల ప్రాజెక్టుకు రూ.5,495 కోట్లు, వలయ వర్తుల రహదారులు, చెరువుల అభివృద్ధికి రూ.3 వేలు కేటాయిస్తామని ప్రకటించిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. ఈ విషయంలో రాష్ట్ర భాజపా నాయకులు మోదీని అడిగే ధైర్యం చేయలేకపోతున్నారని తూర్పారబట్టారు. తాను ఒక్క రూపాయి కూడా కూడా ఎవరి నుంచి లంచం తీసుకోలేదని, ఇప్పుడు ముడాలో జరగని అక్రమాలకు విపక్షాలు పెడబొబ్బలు పెడుతున్నాయని ఆరోపించారు. జిల్లా వ్యవహారాల మంత్రి మహదేవప్ప, మంత్రులు వెంకటేశ్, రహీం ఖాన్, బోసురాజు, కెమ్మెల్సీ యతీంద్ర, ఎమ్మెల్యేలు రవిశంకర్, దర్శన్ ధ్రువనారాయణ, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అరెస్టు పేరిట హడలెత్తించి..

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : 'అక్రమంగా ప్రకటనలు, అశ్లీల వీడియోలు, ప్రజలను హింసించే సందేశాలను పంపిస్తున్నారు. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తాం' అంటూ వచ్చిన ఫోన్‌కాల్‌తో ఎస్.గణపతి అనే వ్యక్తి భయపడిపోయారు. ధార్వాడకు చెందిన ఆయన ఒక బ్యాంకు నుంచి ఇటీవలే పదవీ విరమణ పొందారు. 'మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తే.. ఇంటి నుంచి బయటకు వెళ్లలేరు. ఫోన్‌లో ఎవరితోనైనా మాట్లాడితే అరెస్టు చేసి, కారాగారంలో వేస్తా'మని బెదిరించారు. కొంత నగదు ఇస్తే, కేసులేకుండా చేస్తామని ఆయనను నమ్మించి రూ.95.50 లక్షల నగదును ఖాతాల్లోకి బదిలీ చేయించుకున్నారు. మోసపోయానని ఆలస్యంగా గుర్తించిన ఆయన హుబ్బళ్లి-ధార్వాడ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

కన్నడ వైభవం ఉట్టిపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న శివానంద

రాయచూరు, న్యూస్‌టుడే: కన్నడనాడు నుడి, సంస్కృతిని ప్రతిబింబించేలా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు పాలనాధికారి శివానంద అధికారులకు నిర్దేశించారు. కర్ణాటక సంభ్రమ 50 ఏళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భాన్ని ఉత్సాహంగా ఆచరిద్దామన్నారు. ఆవిర్భావ దినోత్సవం నిర్వహణపై చర్చించేందుకు మంగళవారం జిల్లా పాలనాధికారి కార్యాలయం సభా భవన్‌లో ముందస్తు సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన శివానంద మాట్లాడుతూ సాంస్కృతిక ప్రదర్శనలతో ఊరేగింపు, కర్ణాటక ఔన్నత్యం ఉట్టిపడేలా నృత్యాలు నిర్వహించాలని సూచించారు. కర్ణాటక సంఘం వద్ద ఉదయం 7.30 గంటలకు భువనేశ్వరి మాతకు పూజ చేయాలని, అక్కడి నుంచి మహాత్మగాంధీ క్రీడాంగణం వరకు ఘనంగా ఊరేగింపు చేపట్టాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకునేలా చూడాలన్నారు. జిల్లాస్థాయి అధికారులతో కలసి తొమ్మిదిమందితో నియమించిన సమితి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వివిధ కన్నడ సంఘాల ముఖ్యులు మాట్లాడుతూ కన్నడ భాషాభివృద్ధికి సేవలందిస్తున్న వారికి జిల్లా స్థాయిలో పురస్కారాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డీవైఎస్పీ ప్రమానంద, యువజన సబలీకరణ, క్రీడా శాఖ సహాయ నిర్దేశకుడు వీరేశ్ నాయక్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అస్థిరతకు కుట్ర



ప్రదర్శన చేస్తున్న సమితి నాయకులు, కార్యకర్తలు

రాయచూరు, న్యూస్‌టుడే: కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు భాజపా, దళ్(ఎస్) పార్టీలు కలిసి కుట్రలు చేస్తున్నాయని ఆరోపిస్తూ 'దళిత సంఘర్షణ సమితి' (సంయోజక) మంగళవారం స్థానిక టిప్పు సుల్తాన్ ఉద్యానవనంలో నిరసన ప్రదర్శన చేపట్టింది. సమాచారం అందుకొని మధ్యాహ్నం ఆందోళన వద్దకు విచ్చేసిన జిల్లా పాలనాధికారి కార్యాలయ అధికారికి సమితి ప్రతినిధులు వినతి పత్రం ఇచ్చి దాన్ని రాష్ట్రపతికి పంపాలని కోరారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుటుంబానికి ముడా అక్రమంగా భూమి కేటాయించిందన్న సామాజిక కార్యకర్త ఫిర్యాదు ఆధారంగా ప్రభుత్వాన్ని ఇబ్బందికి గురిచేయడం దారుణమని అన్నారు. రైతులు, కార్మికులు, నిరుద్యోగుల సమస్యలు, నిత్యావసరాల ధరల పెరుగుదలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాల్సిన బాధ్యత ప్రతిపక్షాలపై ఉందన్నారు. దాన్ని వదిలేసి ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. రాజ్యాంగ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటున్న రెండు పార్టీలను చట్టబద్ధంగా హెచ్చరించాలని కోరారు. ధర్నాకు సమితి జిల్లా అధ్యక్షుడు మల్లప్ప గోనాళ్, ఉపాధ్యక్షులు వీరణ్ణ, మాళింగరాయ, సింధనూరు తాలూకా అధ్యక్షుడు నాగరాజ సాసలమరి నేతృత్వం వహించారు.



నగరసభ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న రక్షణా వేదిక నాయకులు

రహదార్లపై వరద నీటిని అరికట్టండి

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు పట్టణంలో చిన్న చినుకుపడితే చాలు..గంగావతి మార్గంలో హోలీ ఫ్యామిలీ పాఠశాల ఎదుట, రాయచూరు మార్గంలో పీడబ్ల్యూడీ క్యాంపులోని కన్యకా పరమేశ్వరి, ఎల్లమ్మ దేవస్థానాల ఎదుట రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. వాహనాలు తీసుకెళ్లాలంటేనే భయంగా ఉంది..చర్యలు చేపట్టాలని కర్ణాటక రక్షణా వేదిక (శివరామేగౌడ) నాయకులు నగరసభను అభ్యర్థించారు. ఈ మేరకు కమిషనర్ మంజునాథ్ గుండూరుకు మంగళవారం ఓ వినతిపత్రం సమర్పించారు. మినీవిధానసౌధ ఎదుట వృథాగా ఉన్న బస్సు షెల్టర్ అక్రమ కార్యక్రమాలకు నెలవుగా మారింది. దీనిని పోరాట సంఘాలకు వేదికగా ఇస్తే మంచి కార్యాలకు ఉపయోగకరం అవుతుందని అభ్యర్థించారు. పాదచారి మార్గాలపై ఉన్న చిరు వ్యాపారులకు అనువైన స్థలాన్ని చూపించాక ఖాళీ చేయమని తాఖీదులు జారీ చేయడం సబబు. వీటిపై తగు చర్యలు తీసుకోవాలని కరవే నాయకులు దవల్‌సాబ్ దొడ్డమని, హనుమేశ్ తిప్పనట్టి, శ్రీకాంతరెడ్డి, మహబూబ్‌సాబ్, విష్ణేశ్ వినతిపత్రం అందించారు.

రక్తదాతలకు సత్కారం

రాయచూరు, న్యూస్‌టుడే: స్వచ్ఛందంగా రక్తదానం చేసిన దాతలను అధికారులు మంగళవారం సత్కరించారు. డీహెచ్‌ఓ కార్యాలయం సభా భవన్‌లో వైద్యాధికారులు దాతలు బసవరాజ రాంపూర, కిరణ్, బాబు ఇనామదార, గాయత్రికి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా డీహెచ్‌ఓ డాక్టర్ సురేంద్రబాబు మాట్లాడుతూ ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని దాతలను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. వీరిని ఇతరులు స్ఫూర్తిగా తీసుకుని రక్తం ఇచ్చేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. తరచూ రక్తం ఇవ్వడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని పరిశోధనల్లో నిరూపితమైందని చెప్పారు. దాతల సంఖ్య పెరిగితే రక్త కొరతను నివారించడం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్జన్ డాక్టర్ విజయశంకర్, వైద్యాధికారులు షాకీర్, యశోదా, ప్రజ్వల్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానం స్వీకరించిన దాతలు

గౌరీ హత్య నిందితులకు సన్మానమా?



ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తున్న ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే: గౌరీ లంకేశ్‌ను చంపిన కేసులో నిందితులకు మహారాష్ట్రలో సన్మానం చేసిన వారిపై హత్యా ప్రేరేపణ కేసు నమోదు చేయాలని, హింస, ద్వేషాన్ని రగలిస్తున్న మతతత్వ సంఘటనలపై చర్యలు తీసుకోవాలని 'గౌరీ స్మారక ట్రస్టు, గౌరీ బళగ' కేంద్రంపై ఒత్తిడి తెచ్చింది. మంగళవారం ట్రస్టు ప్రతినిధులు ఆంజనేయ కురుబదొడ్డి, మారెప్ప హరవి, శ్రీనివాస కొప్పర, లక్ష్మణ మండలగేరా, శ్రీనివాస కలవలదొడ్డి, లాలప్ప, కుమార సమతళ, ఖాజా అస్లాం తదితరులు స్థానిక టిప్పు సుల్తాన్ ఉద్యానవనంలో ప్లకార్డులు పట్టుకుని నిరసన చేపట్టారు. అనంతరం జిల్లా పాలనాధికారి కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేసి కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు పంపాలని విజ్ఞప్తి చేశారు. గౌరీని కడతేర్చిన నిందితులను సత్కరించడం రాజ్యాంగానికి అవమానంగా భావిస్తున్నామని అందులో పేర్కొన్నారు. నిందితులకు త్వరగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అత్యాచారాలు, హత్యలు చేసిన వారిని గౌరవించడం గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో చూశామని, ప్రస్తుతం కర్ణాటకకు సమీపంలోని మరాఠగడ్డపై జరగడం చూసి నివ్వెరపోతున్నామన్నారు.

అదనపు బస్సులకు వినతి



వినతిపత్రాన్ని చదువుతున్న ప్రవీణ్‌కుమార్

రాయచూరు, న్యూస్‌టుడే: గ్రామ లెక్కాధికారి ఉద్యోగాల భర్తీ పరీక్ష రాసే గ్రామీణ ప్రాంతాల అభ్యర్థుల కోసం అదనంగా బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులకు సూచించాలని 'భీమ్ ఆర్మీ' జిల్లా యంత్రాంగానికి విన్నవించింది. మంగళవారం ఆర్మీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు దీపక్ భండారి, ప్రధాన కార్యదర్శి బాబా ఖాన్ జిల్లా పాలనాధికారి కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాయచూరు, సింధనూరులో 27న నిర్వహిస్తున్న పరీక్షకు సకాలంలో వెళ్లేందుకు పల్లెల నుంచి తిరుగుతున్న ప్రస్తుత బస్సులు సరిపోవన్నారు. ఆదివారం ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కువ బస్సులు నడపాలని కోరారు. జిల్లా, తాలూకా కేంద్రానికి ఒకరోజు ముందుగానే చేరుకుని లాడ్జిలో బసచేసే ఆర్థిక స్థోమత చాలా మంది అభ్యర్థులకు ఉండదన్న విషయాన్ని గమనించాలని కోరారు.

నేత్రానందంగా సిద్ధరామేశ్వర జాతర

రాయచూరు, న్యూస్‌టుడే: వివిధ మఠాధిపతుల సాన్నిధ్యంలో వేలాదిమంది భక్తుల సమక్షంలో సోమవారం రాత్రి రాయచూరు తాలూకా చిక్కసూగూరులో నిర్వహించిన సిద్ధరామేశ్వర జాతర కనులపండువుగా సాగింది. జిల్లా నలుమూలలతో పాటు తెలంగాణ నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. గ్రామ వీధుల్లో రథంలో ఊరేగిన సిద్ధరామేశ్వరుడికి భక్తులు నీరాజనాలు పట్టారు. ఉదయం గర్భగుడిలో స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర ముగిసిన తర్వాత రాత్రి 9 గంటలకు కన్నడ, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దేవస్థానం ఆవరణలో సంగీత కార్యక్రమం జరిగింది. శరణప్ప గోనాళ్, ప్రతిభా గోనాళ్ బృందం సంగీతాన్ని మృదుమధురంగా ఆలపించారు.



రథోత్సవానికి హాజరైన భక్తులు

రాచనగరికి ప్రియాంక

నేడు వయనాడ్‌కు పయనం

ఈనాడు, బెంగళూరు : కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గానికి నామినేషన్ వేయనున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక వాద్రే మంగళవారం సాయంత్రం మైసూరుకు చేరుకున్నారు. ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీతో కలిసి ఆమె మైసూరు విమానాశ్రయానికి చేరుకోగానే కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, పార్టీ నేతలతో కలిసి ఆహ్వానించారు. మంగళవారం రాత్రి మైసూరులోనే బస చేసిన వీరిద్దరూ బుధవారం ఉదయం నేరుగా వయనాడ్‌కు బయలుదేరుతారు. భారీ వర్షాల నేపథ్యంలో విమాన ప్రయాణాన్ని రద్దు చేసుకుని రోడ్డు మార్గమార్గంలో వీరు వయనాడ్‌కు చేరుకుంటారని పార్టీ వర్గాల సమాచారం. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిల్లీ నుంచి నేరుగా వయనాడ్‌కు చేరుకుంటారు. బుధవారం ఉదయం 11 గంటలకు వయనాడ్‌కు చేరుకునే ప్రియాంక వాద్రే అక్కడి కల్పెట్టా బస్‌స్టాండ్ నుంచి వయనాడ్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రోడ్ షో నిర్వహిస్తారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సుర్జేవాలాతో పాటు పలువురు నేతలు హాజరవుతారు.



రైతులతో మాట్లాడుతున్న ఏసీ గజానన బాలె

పంటల పరిహారం మంజూరుకు ధర్నా

మాన్వి, న్యూస్‌టుడే: జిల్లాలోని సాత్‌మైల్ నుంచి సింధనూరు వరకు చేపట్టిన నాలుగు వరసల రహదారికి సంబంధించి భూ, పంటల పరిహారం తేలేవరకు పనులు చేయవద్దంటూ కపగల్ పరిధి రైతులు అడ్డుకున్నారు. రహదారి నిర్మాణానికి అవసరమైన భూమి, సరిహద్దులను గుర్తించడంలో తేడాలున్నాయని ఆరోపించారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన పంటలకు నష్టం వాటిల్లుతుందని వాపోయారు. గుత్తేదారే సరిహద్దు రాళ్లని వేస్తున్నారని, ఇది సరికాదన్నారు. సంబంధిత ప్రభుత్వ అధికారులు, సర్వే సిబ్బంది లేకుండా ఇష్టానుసారంగా ఏవిధంగా సరిహద్దులు నిర్ణయిస్తారని నిలదీశారు. ఈ సందర్భంగా రాయచూరు సహాయక అధికారి గజానన బాలె రైతుల వద్దకు వచ్చి చర్చించారు. భూమి కోల్పోయే కర్షకులకు ప్రభుత్వ నియమాల ప్రకారం పరిహారం అందిస్తామన్నారు. పంటలకు ఎంతమేర నష్టం వాటిల్లిందో వ్యవసాయ, రెవెన్యూ శాఖల నుంచి వివరాలు తెప్పించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. నిర్మాణ పనులకు అడ్డంకులు సృష్టించవద్దని కోరారు. తహసీల్దారు రాజు ఫిరంగి, డీఎస్పీ బి.ఎస్. తళవార్, పీఐ వీరభద్రయ్య హిరేమఠ, ఆర్.ఐ. చరణ్‌సింగ్, రైతు ప్రముఖులు హనుమంతరాయ, ఆంజినేయ యాదవ్, చందప్పనాయక్, లక్ష్మీకాంత్ బొమ్మనాళ, సురేష్‌గౌడ, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కర్ణాటక రాజ్యోత్సవ ఆచరణ



మాట్లాడుతున్న వాహిద్

మాన్వి, న్యూస్‌టుడే: కర్ణాటక రాజ్యోత్సవాన్ని ఘనంగా ఆచరించాలని నిర్ణయించారు. మంగళవారం తహసీల్దార్ గ్రేడ్-2 అబ్దుల్ వాహిద్ అధ్యక్షతన మండల రెవెన్యూ కార్యాలయం సభాంగణంలో నిర్వహించిన కన్నడ రాజ్యోత్సవ పూర్వ సమీక్షా సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. నవంబరు 1న తాలూకావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు తప్పనిసరిగా రాజ్యోత్సవాన్ని ఆచరించాలని, వివిధ శాఖ కార్యాలయాల వద్ద కన్నడ ధ్వజాన్ని ఎగురవేయాలని తహసీల్దార్ సూచించారు. వాయిద్యాల మధ్య కళాకారుల బృందాలతో కన్నడ మాత చిత్రపటాన్ని ఊరేగించాలని, కన్నడ అభిమానులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కన్నడ చలన చిత్రాలను మాత్రమే ప్రదర్శించేలా చూడాలని కన్నడ సంఘాల సభ్యులు డిమాండు చేశారు. కన్నడ కోసం విశేషంగా కృషి చేసిన వారితో పాటు ప్రతిభావంత విద్యార్థులను సత్కరించాలని సభలో తీర్మానం చేశారు. బీఈఓ చంద్రశేఖర్, టీపీ ఈఓ ఖాలిద్‌ఖాద్రి, ఎస్టీ శాఖ అధికారి మహాలింగప్ప, సమాజ కల్యాణాధికారి నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు సవ్యంగా చేపట్టండి

మాన్వి, న్యూస్‌టుడే: పేదల కోసం నిర్మించే ప్రభుత్వ కట్టడాలు నాణ్యతగా ఉండాలని ఎమ్మెల్యే హంపయ్యనాయక్ సూచించారు. మంగళవారం సిరివార పట్టణంలోని రెండో వార్డు పరిధి జైభీమ్‌నగర్‌లో మహిళల సామూహిక హైటెక్ శౌచాలయానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రభుత్వం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేస్తోందన్నారు. చాలాచోట్ల పేద ప్రజలు మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు స్థలం లేకపోవటంతో సమస్య ఏర్పడిందన్నారు. దీన్ని అధిగమించేందుకు సామూహిక హైటెక్ శౌచాలయాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ప్రజల కోరిక మేరకు వార్డుకు హైమాస్ట్ విద్యుద్దీపాలను ఏర్పాటు చేస్తానని భరోసా ఇచ్చారు. సమావేశంలో పట్టణ పంచాయతీ అధ్యక్షుడు వై.భూపనగౌడ, ముఖ్యాధికారి తిమ్మప్ప జగ్గీ, రమేష్ దర్శనకర్, శివశరణ సాహుకార్, సూరిదురుగణ్ణ, అమరేశ్, కృష్ణనాయక్, ఖాజమ్మ, మౌలాసాబ్, జీపీ సభ్యులు పాల్గొన్నారు.



శౌచాలయానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే హంపయ్యనాయక్